# దిగజారిన మాలిన్యం

పై కెన్ని చెప్పినా ధనికులంటే నా కిష్టం. సామాన్య మానవుడి శ్రేయస్సు కోరతాను. అతనికి మేలుకలిగే యత్నం ఏదైనా జరుగుతూంటే, చేతనైన సహాయం చేస్తాను. ధనిక వర్గాలతో పోల్చిచూస్తే నేనూ సామాన్యుణ్ణే. అయినా సామాన్యమానవుడుగా ఉండడం కంటే, అతని శ్రేయస్కామిగా వుండడమే నా కిష్టం. ధనికులంటే యిష్టమే అయినా వారితో చనువుగా, స్నేహంగా, అంతా వొకటిగా మాత్రం వుండలేను. పరదేశీలపట్ల సాధ్యమయ్యే గౌరవభావం, దూర ప్రాంతాలనుగూర్చి 'ఎప్పుడో నీదగ్గరకి వస్తాలే' అని అనిపించే న్యూనత డబ్బున్నవార్ని చూస్తే కలుగుతాయి నాలో. వారి జీవితం గురించి నాకేమీ తెలియదు. ఆ డబ్బంతా ఏమవుతుందో? వారెల్లా అనుభవిస్తారో? వారి దైనందిన జీవితం, చేష్టలు, మాటలు అనుక్షణమూ ఆశ్చర్యంకలగచేస్తూండడమే ఆకర్షణకి కారణం అనుకుంటాను. సాధారణంగా మన ఆధిక్యతని ప్రకటిస్తే హర్షించే వ్యక్తులే మనకి సన్నిహితు లవుతారు. కాని ఆ స్నేహం, సాంగత్యం ఎల్లప్పుడూ ఆనందాన్నివ్వదు. అది లోయలో నడవడంలాంటిది. నడవగా నడవగా వొక పర్వతందగ్గరికి చేరుకుంటాం. పైకి చూస్తేఎత్తుగా శిఖరం కనిపిస్తుంది. మన అల్పత్వం అప్పుడు మనకి తెలిసొస్తుంది. స్వార్థం దిగజారుతుంది. నమ్రతతో చేతులు జోడిస్తాం. ధనికులతో గడిపిన క్షణాలు యిట్లాంటి అనుభవాన్ని కలగచేస్తాయి.

అందుచేత కాంతారావు రమ్మని వ్రాయగానే, గంతేసి బైలుదేరాను. దూరపుచుట్టరికం వున్నా అతన్ని నేను బాగా ఎరగను. కులూంలోయులో నాకో నాలుగెకరాలు భూమి వుందనుకుంటే ఎంతతృప్తో, అతను చుట్టమని చెప్పుకున్నా అంతే తృప్తి. మావాళ్ళందరిలోనూ అంత చిన్నతనంలో అంత పైకొచ్చినవారు మరొకరు లేరు. చాలామంది సంస్కారం, చదువు, హోదా, ఆస్తులు, తెలివి మొదలైనవాటితో నిచ్చెన వేయించుకుని, ఒక్కొక్క మెట్టే ఎక్కుకుంటూ పైకెడతారు. కాంతారావ్ అట్లా కాదు. వేటితో నిచ్చెన చేయించాడో మాకు తెలవదు. కింద నిలబడ్డాడు. ఆరేళ్ళతర్వాత అమాంతం పైన కూర్చున్నాడు. ఎక్కిన నిచ్చెన తన్నిపారేశాడంటారు. గిట్టనివాళ్ళు. ఇందులో నిజానిజాలు నాకు తెలవ్వు ఒకవ్యాపార సంస్థకి అతను అధిపతి. దాని యజమానులు, పెట్టుబడిదారులు పాశ్చాత్యులు. రెండువేలదాకా జీతం. బంగళా, నౌకర్లు, పెద్ద తోట,వొక కారు. పిల్లలకి వుచితవిద్యా వైద్యసౌకర్యాలు, యేడాదికోసారి విమానంలో కుటుంబంతో సహా వుచిత దేశయాత్ర. రెండు నెలల 'బోనస్' - ఉద్యోగాలిచ్చే కమిటీకి సలహాదారుడు; నెల కిన్ని డబ్బాలు సిగరెట్లు, యిన్ని సీసాలు మద్యపానీయం పుచ్చుకునేందుకు లైసెన్సు; అంతటిఉద్యోగం.

ఈ కథకోసం అతన్ని స్నేహితుడుగా చెప్పాలన్నా, అదో రకమైన స్నేహం. అతను ఏ బొంబాయో వెడుతుంటే ఏ ఫస్టుక్లాస్ లోనో పేపర్ చదువుతూ కూర్చుండగా వో చిన్ని చూపు, కుశలప్రశ్న-గార్డు విజిల్ - రైలు కదలడ. వాళ్ళ యింట్లో శుభకార్యం జరిగితే, వొక ఆహ్వానపత్రం రావడం,

నేను సమయానికి డబ్బుంటే శుభాకాంక్షలు పంపడం. అంతే, మా స్నేహం.

వారిసంస్థకి ఆ యేడు పెద్దలాభా లొచ్చాయట. ఏదో వినోదం జరుపుతుంటున్నారు. నాదో నాటిక ఆడడానికి అతని సలహాపై నిశ్చయించి నాకు వ్రాశారు. నా నాటికలు ఆడే వాళ్ళు ఎవ్వరూ లేరు. వీళ్ళు ఆడడానికి నిశ్చయించారంటే, వీరి అభిరుచి, సంస్కృతులపట్ల శంకలు రాసాగినా, వాటిని దిగమింగేసి, నాటకం రేపనగా — యివాళ సాయంత్రానికి ఆవూరు చేరుకున్నాను. స్టేషన్‌కి కాంతారావ్ రాలేదు కాని, కారు పంపించాడు. నన్నూ, సామాను వో పెద్దగదిలో దింపారు; ఒక నౌకరు అన్నీ కనుక్కుంటున్నాడు. టిఫిన్, స్నానం, అలంకారం అన్నీ అయ్యాయి. తోటలో పచార్లుచేస్తున్నాను.

'అయ్యగారు సాయంత్రం ఏడుగంటలకి వొస్తారండి. మిమ్మల్ని యిక్కడే సిద్ధంగా వుండమన్నారండి' అన్నాడు నౌకరు.

'అమ్మగారేరీ?'

'సిమ్లా వెళ్ళారండి'

సిమ్లా ఎందుకో! నే నెప్పుడైనా హిమాలయపర్వత ప్రాంతానికి వెడతానా? ఆ మంచుకొండలు, ఆ విశాలమైన వొంపుల బయళ్ళు, ఆప్యాయతకి కరిగి యువకహృదయంలా సూర్యరశ్మికి విడిన పుష్పాలు, జారిన సెలయేళ్లు, వృద్ధుని వొంటి పన్నులా, తీగని పట్టుకున్న ద్రాక్ష గుత్తులు — పుస్తకాల్లో, సినిమాల్లో చూసిన హిమాలయ పర్వతదృశ్యాలను వెనకటిజన్మలో జ్ఞాపకాలలా స్మరించుకుంటూ వుండగా ఏడైంది.

దూరంగా కారాగిన చప్పుడైంది. అయ్యగారొచ్చా రంటూ ఇద్దరు నౌకర్లు, తోటమాలి హడావుడిగా నడుస్తు న్నారు. కాంతారావొచ్చాడు. రెండుమూడు కుర్చీలు చెట్ల మధ్య వేశారు. బల్లమీద కూల్ డ్రింక్స్ పెట్టారు.

'ట్రైన్ యివాళ టైమ్కొచ్చిన ట్లుందే? ఇక్కడ బాగుందా, స్నానం, టిఫిన్?'

'ఓ చాలా బాగుంది'

'షవర్ బాత్ చేశావా?'

'అదేదో అట్లాంటిదే అనుకున్నాను. అదీ యిదీ తిప్పి చూశాను. నీళ్ళుమాత్రం రాలేదు' అన్నాను.

'కొత్త మోడల్ది. మొన్ననే బిగించారు. హేండిల్ పైకి తోసి, హుక్లో బిగించాలి. అయినా నువ్వు కవివి. నీ కేవన్నా అర్థమవుతాయా?' అంటూ కాంతారావు నవ్వడం సాగించాడు.

సంఘంలో పైకొచ్చిన ప్రతివ్యక్తీ, వీలు చిక్కినప్పు డల్లా కవులమీద ఛలోక్తులు విసరడం కొత్తకాదు. అయినా నేను కవిని గాను. ఏ రచనచేసినా సరే ఆ వ్యక్తిని 'కవీస్వ రుడు'గా వ్యవహరించే సంప్రదాయం యింకా పోలేదు కాబోలు నని లోపల అనుకున్నాను.

'ఆమె సిమ్లా వెళ్ళారుట' అన్నాను.

'మా డైరెక్టర్ వో దొరలే. ఆయన భార్య పుట్టిన రోజు సిమ్లాలో జరుపుకుంటూందిట. నా కెల్లానూ తీరదుగనక ఆమే, అబ్బాయీ వెళ్ళారు. స్త్రీల పుట్టినరోజు పార్టీలకి మొగాళ్ళు వెళ్ళకూడదు. వారి పుట్టినరోజు జ్ఞాపకంవుంచుకుని

వయస్సుని మాత్రం మరిచిపోవాలి. ఇది మొగాడికి సాధ్యం కాదేమో' అన్నాడు కాంతారావు. ఇద్దరం నవ్వుకున్నాం.

'రిహార్సల్స్ సాగుతున్నాయా?' అని అడిగాడు.

'ఏం రిహార్సల్స్?'

'అదే, రేపటి నాటకం తాలూకు...'

'ఓ, అదా! నీ నాటకమా! రేపటిమాట కదా, చూదాంలే' అన్నాడు.

అంత పెద్ద అధికారిని రిహార్సల్స్‌లాంటి స్వల్పవిషయం గూర్చి అడగడం పొరపాటని గ్రహించి, పెదవి కొరుక్కున్నాను అతను చూడకుండా.

'నువ్వు వొస్తున్నావని తెలిసి, కొందరు స్నేహితుల్ని పిలిచాను. చిన్న పార్టీలాంటిది జరుపుదాం. ఏం?'

'ఎవర్ని?'

'నువ్వెవర్నీ ఎరగవేమో. దీనదయాళ్ అని మా సంస్థ వినోదాల కార్యదర్శి; డాక్టర్ హరికృష్ణ, ఇక్కడ డాక్టరు. అతనే సంస్థేమాధికారి కూడా; అతని భార్య 'వసుధమయి'—అందరం 'సుధా' అంటాం; సూపరిండెంటు శ్రీనివాసులు; అతను రానని కబురంపాడు; మనం; అంతే. 'సుధ'ని చూసి గాబరాపడకేం?' అని కొంటెగా చూసి నవ్వాడు.

'ఏం కథ?'

'నువ్వే చూస్తావుగా. విపరీతంగా తాగేస్తుంది. శృంగార చేష్టలు సాగిస్తుంది. అన్నట్లు నువ్వు కవివిగా, కాస్తంత రుచి చూస్తావుగా, శృంగారచేష్టల్ని కాదుసుమా!' అన్నాడు. రచయితకి అన్నిరకాల అనుభవాలు కావాలి. ఈ అవకాశం

పోగొట్టుకోవాలని లేదు. ఇట్లా వొదిలేసుకున్న అవకాశాలను స్మరించుకునే తరవాత పశ్చాత్తాపపడటం జరుగుతుందని నాకు అనుభవమే.

కాంతారావు కేసి పరీక్షగా చూశాను. వెంటనే అతనిలో కనబడేది ఎత్తైనవిగ్రహం. ఎత్తైనవాళ్ళేగాని ; చెప్పుకోదగ్గ వ్యక్తులుగా చూడరు పాశ్చాత్యులు. అస లది చూసే యీ వుద్యోగం యిచ్చారేమోకూడా! పొట్టినిక్కరు, పొట్టి కాన్వాస్ జోళ్ళు, బెల్టు, మణికట్టంతా ఆక్రమించిన రిస్టువాచి, చదరంగా మెలికలు తిరిగిన కండలు కనిపించే-బుజాలు, మెడ, వొంకీలు తిరిగి పైకిదువ్విన పల్చటి క్రాప్, కళ్ళకింద కోణంగా తేలిన చెంప ఎముకమీద బిగిసిన చర్మం, క్రమం తప్పిన వొకటి రెండు మినహా - వరుసగా స్ఫుటంగా వున్న పళ్ళు, విరగబడి నవ్వినప్పుడు చిగుళ్లు ఎర్రగా కనిపించి, సంధ్యాసమయంలో మేఘాల చివర అలుముకున్న ఎరుపులా - ఈ కథ కాంతారావునుగూర్చి కాదు గనుక, నే నతన్ని వర్ణించను.

స్నానంచేసి వొస్తానని లోపలి కెళ్ళాడు. నేను లేచి మొక్కలమధ్య పచార్లు చేస్తున్నాను. స్వేచ్ఛగా ప్రకృతిలో వాటంతట అవి పెరిగిన చెట్లని, మొక్కలని చూసి ఆనందించి నట్లుగా, మనిషి సృష్టించిన తోటని చూసి అనందించలేను.

మనిషి వేసిన తోటలో క్రమం, వో వరుస, వైవిధ్యం వుంటాయి నిజమే. తాత్కాలికమైన ఆహ్లాదాన్నికలుగజేస్తాయి యీ తోటలు. ఇంద్రియాల వొత్తిడి పై వాటి అరాజకమైన చీకటినీడల శక్తితో విప్లవంచేసి, వోడించి, పర్వాళింపజేసి, నిశ్చలమైన వైరాగ్యాన్ని యివ్వవేమో, మనిషి వేసిన తోటలు!

నే స్వంతంగా వేసుకున్న తోట అంతటి ఆనందాన్ని కలగ చేస్తుందేమో నా కింకా అనుభవంలేదు.

గేటు చప్పుడైంది. చప్పుడు చేస్తూ యిద్దరు వ్యక్తులు నా ముందుగా నడిచి, వరండాలో కుర్చీలమీద చతికిల పడ్డారు. ఒకాయన ఎత్తుగా సన్నంగా వున్నాడు. మరో ఆయన పొట్టిగా, లావుగా వున్నాడు. లావాటాయన మాటలు లేని పాట బిగ్గరగా పాడటం సాగించాడు. నా కేసి చూసి నిల్చి పోయాడు.

'మీరేనా వొచ్చింది మధ్యాహ్నం?'

'అవునండీ'

'కాంతంగా రొచ్చి చాలాసేపై వుండాలి. లోప లేం చేస్తున్నాడు? భార్య వూళ్ళో లేదుగా' అని నవ్వుతున్నాడు.

'స్నానంచేస్తున్నాడు' అన్నాను.

'పరిచయంచేసుకుందాం పట్టండి, స్పృహలో వున్న ప్పుడే. ఈయన దీనదయాళ్, మా క్లబ్ సెక్రటరీ. నేనేమో డాక్టర్ హరికృష్ణ. హరేకృష్ణ కృష్ణహరే అనే ప్రార్థనుంది చూశారూ! అది – అంటే పేషంట్లు ఆవిధంగా తమవద్దనుండి వెళ్ళిపొమ్మని ప్రార్థిస్తూంటారన్న మాట!'

దీపంవెలుగులో ఆయన్ని పరిశీలించాను. ఎర్రగా, కందగడ్డలా వున్నాడు. నెత్తిన వెంట్రుకలు అక్కడక్కడ వుండికూడా, ఏమీ లేనట్లుగా, చదునుగా వుంది బుర్ర. కళ్ళ కింద అర్థచంద్రాకారంలో ముడతలు, గడ్డంకింద సృష్టికి ప్రతి సృష్టిలా మరో గడ్డం, శరీరంలో కండలు పట్టుజారి, స్వేచ్ఛగా వింతవింత ఆకృతులలో దిగజారి ఏ భాగం ఎక్కడ ప్రారం

భమై, ఎక్కడ అంతం అవుతుందో తెలీకుండా, స్క్రీలిస్ట్
చిత్రంలా తయారైంది ఆయనశరీరం.

సెక్రటరీని, నాటకం రిహార్సల్సు గురించి అడుగుదా
మని గొంతు సవరించుకుని వాక్యనిర్మాణం చేస్తుండగా
కాంతారా వొచ్చాడు.

నౌకర్లు కుర్చీలూ, బల్లలూ తోట మధ్యగా అమ
ర్చారు. ఆ ముగ్గురూ ఏవో పాడుకుంటూ, మాట్లాడుతూ,
నవ్వుకుంటూ, కుర్చీలదగ్గర కొచ్చారు. నన్ను రమ్మన్నారు.

'ఈయనదే రేపటి నాటకం' అని కాంతారావు నన్ను
పరిచయంచేశాడు.

'చాలా బాగుందండి'

'మీరు చదివారా?'

'అది కాదు, మిమ్మల్ని కలుసుకోవడం' అన్నాడు హరి
కృష్ణ.

'చదవడం ఎందుకు? రేపు చూస్తున్నాంగా. అన్నట్లు,
రేపురాత్రి కార్యక్రమం ఏమిటి దయాళ్?'

'చూడాలి. సాయంత్రం ఫోటో, పార్టీ. ఆ తర్వాత
లాజరస్‌గారి ఉపన్యాసం. తరువాతది మన అప్పటిపరిస్థితినిబట్టి
వుంటుంది, కుర్చీల్లో కూర్చునే చైతన్యం వుంటే.' హరికృష్ణ
సంగీతంలో వాక్యం పూర్తవలేదు. నౌకర్లు గబగబ గ్లాసులు,
ప్లేట్లు బల్లమీద అమరుస్తున్నారు. నేనీలోగా గొంతుసవరించు
కొని నాటకం ఎంతవరకూ తయారైందో అడగాలని నిశ్చయిం
చుకున్నా.

'అవుతే మీరు కవులన్న మాట! మాకు యీ కవిత్వాలతో కుదరదండి. మన వృత్తేమిటి బ్రదర్! డాక్టర్‌గా పిల్లల్ని పుట్టించడం – కాంతారావు పనివాళ్ళని పెంచడం– చివరలో నేనే వారిని చంపెయ్యడం, ఈలోగా ఆ పని కాస్తా మా సుధా నైటింగేల్ చెయ్యకుండా విడిచిపెడితే! హాహా, హాహా, హా, హా' అని మొదలెట్టిన నవ్వుని పాటలో దించేశాడు.

నౌకరు గ్లాసుల్లో ఐస్ వుంచి, సోడాలుకొట్టి పోశాడు. రెండు పెద్దసీసాలు రిఫ్రీజిరేటర్ లోంచి తీశాడు. కాంతారావు మూతలుతీసి ద్రావకం గ్లాసుల్లో సర్దాడు. నాచేతుల్లో వో గ్లాసు పెట్టాడు.

నాకు భయమేసింది. దగ్గరదగ్గరగా అంటుగెత్తు గ్లాసు. నాకు కొత్త. ఏమవుతుందో! ముందు వాళ్ళ కేమౌతుందో చూసి తరవాత వుపక్రమిద్దామనుకుని తటపటాయిస్తున్నాను.

'మీకు కలవాటు లేదా?' అన్నాడు దీనదయాళ్.

'మావాడికి కొత్త'

'అది వొట్టిమాట. ప్రతివ్యక్తీ త్రాగుడు అలవాటుతోనే పుడతాడు. ఆముదం, పాలతో ప్రారంభం. సృష్టికర్త గొప్ప త్రాగుబోతు. లీల, కేళి, విహారం, తాండవం. ఏదో పద్యంకూడా వుంది – నాకు రాదు కాని. ఇవన్నీ త్రాగుడు లేని వారికి సాధ్యంకావు. దేవతలు సురాపానం, అమరులు సోమపానం, దైత్యులుమాటకొ అర్థంతెలీదనుకోండి. ఏదోఅనేశాను– రమ్. ప్రతివాడూ వో దానికోసం పుట్టాడు. దీనదయాళ్‌ని చూడండి; విస్కీవాలా; నా బ్రతుక్కింత బ్రాందీ చాలును; కాంతారావు జిన్ తప్ప మరోటి ముట్టడు. ముఖ్యంగా అది

వారం. నర్సు సుథా నైటింగేలుకోసం షాంపేన్ కనుక్కు-న్నారు, పాశ్చాత్యులు. కాని, ఆమె దాన్ని ముట్టదు.' ఆ ముగ్గురూ గ్లాసులు తగుల్చుకొని, నా గ్లాసుకి తగిల్చి, పుచ్చుకుంటున్నారు.

'ఊ- కానీ' అన్నాడు కాంతారావు.

'కాసేపుండి' అన్నాను.

'దీని కో ముహూర్తంకూడానా?'

'ముందు మీరు కానిస్తూవుండండి.'.

'పోనీ కాసేపాగండి. మాఆవిడ వస్తూవుంటుంది. ఆవిడకి తోడుందుమనుగాని' అన్నాడు హరికృష్ణ.

'ఆమె యింకా రాలేదేం?'

'డ్రెస్ చేసుకోవద్దూ! డ్రెస్ వుండడంవల్ల కవులుగనుక మీాకు తెలుస్తుంది-కొన్ని లాభా లున్నాయి. నగ్నంగా వుంటే ఎంత బాగుంటారో వూహించుకోవచ్చు. అందులో ఆనందం లేదంటూరా?' అన్నాడు డాక్టర్.

'ఉంది.కళలలో బాగా.కనబడుతుంది. ఆధునికశిల్పంలో 'టార్సో' ప్రధానమైంది. శిల్పానికి తలుండదు – కాళ్ళుండవు. చిత్రలేఖనంలో సగం జారిన పమిట, సాహిత్యంలో వర్ణించక విడిచిపెట్టిన కొంటెచేష్ట – యివి రసానుభూతికి ఆయువుపట్లు – నగ్న సత్యం అన్నారు. సభ్యత అనే ఓ తెర వుంటుంది. కళలో కూడా. ఆ తెరని పూర్తిగా తొలిగించడానికి వీల్లేదు' అన్నాను.

చెప్పడానికి ధైర్యం చాలక తొక్కి-పెట్టేసిన వుద్రేకాల తీవ్రత యీా అవకాశం చిక్కించుకుని నా చేత యీా వుపన్యాసం చెప్పించివుంటుంది. లేకపోతే నే నెందుకు అంత

తీవ్రంగా చెప్పడం?— దానికి అర్థం వుందా? అర్థం తగ్గిన కొద్దీ, వుద్రేకం హెచ్చుతూంటుంది కాబోలు. డాక్టరు నే చెప్పింది చాలా బాగుం దన్నాడు. తనకి బోధపడలేదుగనుక అందులో ఏదో నిజం వుండాలన్నాడు కాంతారావు. 'ఆదర్శం కోసం దేన్నైనా త్యాగంచెయ్యడానికి సిద్ధపడతాం, ఎటొచ్చీ ఆ ఆదర్శం స్పష్టంగా వుండకూడదని ఎవరో అన్నా' రన్నాడు దీనదయాళ్. నా గ్లాసులో ఐస్ కరిగింది. వొక్క గుటకేశాను. అంతా నాకేసి చూశారు. అంతా నిశ్శబ్దంగా వుంది. చక్కిలి గింతలు పెట్టి కదిపినట్లుగా, నిశ్శబ్దంలోంచి తన్నుకులాడి బైట పడింది, వో స్త్రీకంఠంలోంచి నవ్వు. ఆ నవ్వు వెనక వూగిస లాడుతూ సుధామయి.

'మాటా పలుకూ లేకుండా యింత నిశ్శబ్దంగా వున్నా రేం — డాక్టరుగారు ఛలోక్తులాడి నవ్వించాలని...'

నావంక చూసి ఆగింది. కాంతారావు నన్ను ఫలానా అని పరిచయంచేశాడు. 'గంథకర్తగారా! ఈ తరంవాళ్ళనే కాకుండా ముందుతరాలవాళ్ళనికూడా విసిగించేవాడు గ్రంథ కర్త — అని ఎవరో అన్నారు' అంది.

'అప్పుడప్పుడు ఏకాంకికలు వ్రాస్తూ...'

నా వాక్యం పూర్తవకుండానే ఆవిడ మొదలెట్టింది.

'ఏకాంకిక అంటే ఒకసారి తెరలేచి, చివరలో తెరపడు తుంది — అంతేనా?'

ఏకాంకిక స్వరూపం గూర్చి నాకున్న అభిప్రాయాలు చెప్పడానికి వాక్యాలు నిర్మాణంచేసుకుంటున్నాను. మళ్ళా ఆవిడే అంది:

'మీకు పిల్ల లున్నారా?'

'అదేం ప్రశ్న? ముందు వివాహమైందేమో కనుక్కోకుండా?' అన్నాడు హరికృష్ణ.

'పెండ్లికాకపోతే పిల్లలు పుట్టరా ఏం?' అన్నదామె.

'పెండ్లయితేనే పుట్టడంలేదే యీరోజుల్లో!' అన్నాడు భర్త.

'అందుకనే మీతో బైటకి రానంటాను' అని లేచి తోటలోకి నడిచింది.

'కోపం వచ్చేసింది భాయీ – అలకతీర్చడం మీ వంతు' అన్నాడు భర్త. కాంతారావు నన్ను లేవదీశాడు. ఇద్దరం తోటలోకి వెళ్ళాం. కాంతారావు ఆమెని బ్రతిమిలాడాడు, లోపలికి రమ్మని. మొక్కల్లోంచి వింతపరిమళం, నీళ్ళకి తడిసిన మట్టివాసనతో కలసి ఆవరించింది. నక్షత్రాలు స్ఫుటంగా మెరుస్తున్నాయి. పరిమళం వాటిసద్దనుండి వస్తున్నట్లు. బురదనీళ్ళల్లో మసకగా మెదిలిన చంద్రబింబం నీడలా ఆమెముఖం వెలవెలపోయింది. నీళ్ళు నిశ్చలంగా వున్నాయి. చంద్రబింబంనీడ కదలడం లేదు.

'గ్లాస్‌లో ఐస్ వేడెక్కుతుంది. లోపలికి రండి' అన్నాడు కాంతారావు.

హరికృష్ణకూడా వచ్చాడు. ఆమెనడుంచుట్టూ చేతులు బిగించి, పైకిలేవదీసి లోపలికి తీసుకొస్తున్నాడు. కాంతారావుని కూడా ఒకచెయ్యి వెయ్యమన్నాడు. ఇద్దరూ వరండాలోకి చేరేశారు.

'ఇంటిదగ్గర ఒకడోసు అయిందా?' అన్నాడు డాక్టరు హరికృష్ణ.

'చూడు కాంతారావు – ఆ మాధవమ్మ కొడుకు చావుబ్రతుకులమీద వున్నాడు. వాడివిషయం కనుక్కోకుండా, యిల్లా వచ్చేస్తే వాడేంగాను? నే వెళ్ళి డాక్టర్ వెంకట రెడ్డిని తీసుకొచ్చి – యిల్లా వచ్చాను.' భర్తకి కోపంవచ్చింది. ఆ కాలనీ డాక్టర్– సంక్షేమాధికారి తనుండగా, బైట డాక్టర్ని తీసుకొచ్చే అధికారం తన కేముంది?

ఈ అక్రమానికి తగుచర్య తీసుకోమన్నాడు కాంతారావుని.

'పిల్లలవిషయం ప్రతిసంభాషణలోనూ దించడందేనికి? ఆయన పెండ్లిసంగతి నీ కెందుకు? అది మర్యాదా?' అని హరికృష్ణ నావైపు చూశాడు.

'ఫరవాలేదు, దాని కేం లెండి – అందులో తప్పేముంది?' అన్నాను ఏదో సర్దుబాటుచేస్తూ.

'ఎందు కడిగానంటే, పిల్లలు గలవాళ్ళు నాటకాలు వ్రాస్తారు. లేనివాళ్ళు నాటకాలాడతారు. మనం చేస్తున్నదే అది – నాటకాలాడడం...మీ గ్లాసింకా అల్లాగే వుందేం...' అన్నదామె నాకేసి చూసి.

'నీతోపాటు పుచ్చుగుందామని' అన్నాడుకాంతారావు.

'ఎంత మంచి గ్రంథకర్తండీ మీరు! అవుతే ప్రారంభించండి' అని ఆమె త్రాగటం మొదలెట్టింది. నేనూ, అటూ యిటూ చూసి, ఒక్క గుక్కలో గ్లాసులోదంతా పుచ్చేసుకున్నాను. ఆ ముగ్గురూ ఆశ్చర్యపడ్డారు. అల్లా ఒక్కగుక్కలో

పుచ్చుకోకూడ దన్నారు. 'నాకు తెలియదు. క్షమించండి' అన్నాను.

'కొందరికి అట్లా పుచ్చుకుంటేగాని, పుచ్చుకున్నట్లు వుండదు.' అంటూ సుధామయి గ్లాసులోదంతా తాగేసింది.

హరికృష్ణ నిర్వేరబోయ్యాడు. ఆమెచేతుల్లోనుండి గ్లాసు తీసేశాడు. భర్తముందున్న గ్లాసులో సగంకూడా వక్కగుక్కలో త్రాగేసింది.

'ఎల్లావుంది?' అనడిగాడు కాంతారావు.

'వగరుగా వుంది, నాకేమీ రుచిగా లేదు. ఇందులో మజా ఏమిటో తెలియడంలేదు' అన్నాను.

మరోసారి గ్లాసు నింపాడు.

దీనదయాళ్ – 'ఆయనకి కొత్త, అల్లా పొయ్యొద్దు' అన్నాడు తను పోసుకుంటూ.

'ఇదొద్దు – ఇంకేదేనా తియ్యటిది ఇవ్వండి' అన్నాను.

'ఓ, వైన్స్ కావాలన్నమాట. ఆస్ట్రేలియన్ 'ఎమో' వైన్ బాగుంటుంది.' అంటూ కాంతారావు, తెల్లపెట్టెలోంచి వైన్‌బుడ్డి తీసి, చిన్నగ్లాసులో కొద్దిగా పోశాడు.

'మీకీ వైన్ ఎక్కడిదీ?'

'మొన్న జాక్సన్‌దొర పార్టీకి తెచ్చాడు.'

సుధామయి, నా గ్లాసు తీసుకుని త్రాగేసింది. ముగ్గురూ నవ్వడం సాగించారు. కాంతారావ్ వో లెక్చరిచ్చాడు. నాలు గైదు రకాలు వొకేసారి పుచ్చుకోకూడ దన్నాడు. మెల్లి మెల్లిగా త్రాగాలన్నాడు. నౌకరు ఆమ్‌లెట్లు, రొట్టెలు తెచ్చాడు. ఈ పూటకి నాకు చాలు నన్నాను. అది ఎటికెట్

కాదన్నారు. మళ్లా నాగ్లాసులో కొద్దిగా వైన్ పోశారు. కాస్తంత పంచదార వెయ్యమన్నాను. గొల్లుమని నవ్వారు. దీనదయాళ్ తూలి కుర్చీమీదనుంచి పడిపోయ్యాడు. అతన్ని సుధామయి, డాక్టర్ కలిసి లేవదీశారు.

'నాలుగైదు రకాలు త్రాగడం గూర్చి వోకథచెప్పనా? ఈనలాగే వొకాయన వొకరోజున జిన్‌లో సోడాకలిపి తీసుకున్నాడు. మత్తుచేసింది. మర్నాడు, విస్కీలో సోడా కలిపి తీసుకున్నాడు, మరీ మత్తుచేసింది. ఆ తరవాత మరో రోజున బ్రాందీలో సోడాకలిపి త్రాగాడు; మత్తెక్కింది. రమ్‌లో సోడా కలిపి తీసుకున్నాడు. మళ్ళా మైకం కమ్మేసింది. ఆఖరికి వో నిశ్చయానికొచ్చాడు - యీ మత్తుకి కారణం సోడా అని.'

అందరూ నవ్వడం సాగించారు. సుధామయి పళ్ళు ఎంతో అందంగా వుంటాయనీ, అందుకనే ఆమె అస్తమానూ నవ్వుతో వుంటుందని అప్పుడు తెలుసుకున్నాను. వారు కబుర్లు చెప్పుకుంటున్నారు. దీనదయాళ్ కొడుకుని ఇంగ్లండు పంపుదామా, అమెరికా పంపుదామా? కాంతారావు కూతురికి నృత్యం ఎక్కడ, ఎవరిదగ్గర చెప్పించాలి? వొచ్చేనెల కంపెనీ మీటింగు అస్సాములో జరుగుతుందిట. ఏర్‌కండిషన్డ్ కోచ్‌లోనా, విమానంలోనా ప్రయాణం? దీనదయాళ్‌కి రెండువేలు చేబదులు కావాలి, ఎవరిస్తారు! కాంతారావుకి నాలుగు వేలు కావాలి, ఎవ రిస్తారు? హరికృష్ణ మొన్ననే రాఘవన్‌కి రెండు వేలిచ్చాడు. తన దగ్గరేంలేదు. మరి సుధా ఏమన్నా విడిగా దాచినదాంట్లో సర్దగలదేమో, స్పృహలో వున్నప్పుడే అడిగి తెలుసుకోడం మంచి దన్నాడు.

నేను వారి జీవితవిధానాన్నీ. మనస్తత్వాలనీ పరిశీలిస్తూన్నదాన్నిబట్టి శరీరంలో వొచ్చిన మార్పులని వూహిస్తూ కూర్చున్నాను. దీనదయాళ్ తప్ప వారంతా నడివయస్కులు. సుధ వయస్సు ముప్ఫై అయిదు లోపు. దగ్గరగా పరిశీలించడానికి అలవాటుపడితేగాని ఆమెచక్కదనంలో ప్రత్యేకత వ్యక్తంకాదు. అంత మరీ ఎరుపుకాదు, చామన చాయకంటె మరొక్క ఛాయ. కోల మొహం, చిన్నముక్కు, స్వేచ్ఛగా నవ్వేయడానికి అలవాటుపడ్డనోరు, గడ్డంకింద చిన్నినొక్కు, పటుత్వం సన్నగిల్లని శరీరం, నడుం, రొమ్ములు, పిరుదులు, వేటికవి విడిగా తీర్చిదిద్దినట్లు చీరని పాయలగా చీల్చి, పడవల్సిన చోటనే మడతలుపడుతూ, చిత్రకారుడికీ నగ్నప్రతిమలశిల్పికీకూడా తృప్తినిచ్చే ఆకృతి ఆమెది! ఆకుపచ్చరంగు షిఫాన్ చీరలోంచి నల్ల బోర్డర్ గల జాకెట్, గుండ్రంగా మెడచుట్టూ బరువుగా సూర్యకిరణాల నెక్ లెసు, 'స్వస్తికాలో' డైమండ్స్ అమర్చిన దుద్దులూ, పాపిటలో వీడిన చోట కుంకుమ—అదీ ఆమెవిగ్రహం తీరువు. చూడగానే చటుక్కున కనబడే ప్రత్యేకత ఆమెజుట్టు – పొడుగాటి ఎత్తైన తలకట్టు, జడ. అందులోంచి మొహం చిన్నదిగా కనబడుతుంది. అంతా వుంగరాలు తిరిగి మెడదగ్గర, చెంపలమీద, పాపిట ముందూ పొదల్లే అలుముకున్న వెంట్రుకలు. పాపిట రెండు వెంపులా నూనెవేసినట్లు ముందు వెంట్రుకల నీడలు నుదుటిమీద కదులుతూ, చూపుని తమవైపు తిప్పుకుని నిలిపివేస్తాయి. ఆ నుదుటిమీదే కుడికనుబొమ్మపైన అరంగుళం గాయం మచ్చ.

వాన్ని ప్రేమించడం - యీ రెంటికీ వున్న తేడా చూపాలని యీ నాటికలో వొక యత్నం జరిగింది.'

సుధా, భర్త వొకరికేసి వొకరు చూసుకున్నారు. ఆ నవ్వులో భవిష్యత్తు వున్నట్లు స్ఫురించింది. హారికృష్ణ సంగీతం ప్రారంభించాడు. దీనదయాళ్ హైస్టాయిలో అతనితో కలిసి పాడే యత్నం చేస్తున్నారు. కాంతారావ్ కూడా, అదోలా అయి, పరధ్యాన్నంలో వున్నట్లుంది.

'కథ చెప్పు చంపక' అన్నాడు.

మాటలు బరువుగా రాసాగాయి.

స్పష్టత సన్నగిలింది. నేను తటపటాయించాను. మొదలెట్టి చూద్దాం అని వుపక్రమించాను.

'ఒకామె వుంది. ఆమె భర్త వున్నారు. భర్తంటూ లేకపోతే, మన ప్రియురాం్రడని పోషించేదెవరు...?...'

ఒక్కసారిగా సుధ నవ్వింది. పొడుగ్గా, సంగీతం పాడి నట్లుగా, అతిశయోక్తిగా నవ్వింది. ఆమెను చూసి హారికృష్ణ నవ్వడం. దీనదయాళ్ కూడా నవ్వుతున్నాడు. ఓ క్షణం నిదానించి, మోటారు సైకిల్ టైర్ బ్రద్దలైనట్లూ, కంటి భోషాణం ఎత్తునుండి పడినట్లూ, కాంతారావు నవ్వాడు.

నా కర్థంకాలేదు. అసహాయత కోపంలోకి మారింది. అరసికునిముందు పాండిత్య ప్రకర్షంటే యిదే కాబోలు నను కున్నాను. ఆ గ్లాసులన్నీ పగలగొట్టాలనీ, వాళ్ళ మొహాన వళ్లాలు విసిరెయ్యాలనీ సుధ మెడలో సూర్యకిరణాల నెక్లెస్ బలాత్కారంగా వూడదీసి, గిరవాటెట్టాలనీ, ఏవేవో సినిమాలో 'విలన్' చేసే భీభత్సమైన చేష్టలను ప్రేరేపించే ఆలోచన

లొచ్చాయి. ఆ నవ్వు నిలిపి, వూపిరి బాగా పీల్చి, కన్ను మెదిపి, మళ్ళా మరో స్థాయిలో నవ్వు సాగించింది. ఆ నలుగురూ కన్ను మెదపడం, వో ఆటగా ప్రారంభించారు. నాకేసి చూస్తూ కన్ను మెదపడం మొదలెట్టారు. ఆ దృశ్యానికి నా కోపం జాలిగా మారింది. వారి శరీరాలు యంత్రాలు. వాటిపై వారికి స్వాధీనం లేదు. కోపానికి చలించే చైతన్యం వారిలో లేందే కోపగించి ప్రయోజనం? తుఫానుకి సముద్రంలో కెరటం గిలగిలతన్నుకుంటుంది. దానిలోతు దానికేం తెలుసు? నావుపమానా లెవరికి కావాలి? వారిముందు నే నెవర్ని? అసలు అందరం ఎవరం? ఆ క్షణంలో అందరం వొక్కటిగా ఐక్యత పొంది, సృష్టిలో 'వునికి'కి నిదర్శనంగా తయారవకూడదా? 'అహం'లోంచి బైటికి గెంతి, నగ్నంగా ఆ నవ్వులో కలిసిపోగూడదూ? అప్రయత్నంగా నేనూ వొక్కసారి నవ్వేశాను. నన్ను చూసి వారందరూ మిగిలనవోపికతో జలవిద్యుత్ లాంటి కన్నీటిని మొహం అంతా వ్యాపింపచేసి, మహొక్కకడసారి లయతో, శరీరాలు పగలకుండా చేతులతో అదిమిపట్టి, సుదీర్ఘమైన నవ్వుని సృష్టించి, ఆనందవాహినిలో కలిసి అందరం వొకటైపోయినాము.

ఇంక తరువాత జరిగినవాటిని గురించి చెప్పను. త్రాగి మైమరచిన వ్యక్తులను జీవితంలో హర్షించను; అట్లాంటివారిని చిత్రించే కథలన్నా, నాటికలన్నా, నవలలన్నా, సినిమాలన్నా నాకు తలనొప్పి. ఆ పాత్రలు ఎంత గొప్పగా సహజంగా చిత్రితమైనా నాకు వాటియెడ ఆకర్షణా, సానుభూతీ కనబడవు. ఒకప్పుడు వెనకటితరంలో అట్టివారిని చిత్రించి, సంస్కారం తీసుకొచ్చి, ప్రయోజనం సాధించే అవసరం వుండేదేమో,

వాటికి ఆనాడు చలామణీ వుండేదేమో నాకు తెలీదు. అప్పుడూ, యిప్పుడూ, ఎప్పుడూ కూడా ఆది కళాసృష్టికి అనువైన వస్తువు కాదనుకుంటాను నైతిక విలువల సూక్ష్మమైన పరీక్షలో అందం వుంది. ఆ పరీక్షకి ఏదో వొక జీవితవిధానం అందరికీ అంగీకారమై స్థిరపడినది – అవసరం. మైమరచిన వ్యక్తులు యీ పరీక్షకు అతీతులు. అందుకనే వారిని చూసి జీవితంలో జాలిపడినా కళలో వారిపట్ల కలిగేది రోత.

సుధని, ఆమె భర్తని వో కార్లో, దీనదయాళ్‌ని మరో కార్లో సాయంపట్టి చేరేశాం. తరువాత కాస్సేపటికి కాంతారావు నేను కలసి భోజనంచేశాము.

కాంతారావు గదిలోకి పోతూ 'అందరూ సుధ ప్రియులే–వారిని పోషించే భార్య లున్నప్పుడే...' అని నవ్వుతూ నిష్క్రమించాడు.

ఆ రాత్రంతా ఐస్ ముక్కలు నుదుటిమీద పెట్టుకొని పరున్నాను.

*  *  *  *  *

ఆ మర్నాడుదయం తొమ్మిదింటికి కాంతారావు కనిపించాడు. రాత్రి బాగా నిద్రపట్టిందా అని అడిగాడు. నేను మైకంచెందనందుకు నన్నభినందించాడు. 'అసలు నే పుచ్చుకున్నదేదీ, ఊరికే పుచ్చుకున్నట్లు నటించాను' అన్నాను.

'అందుకే నాటకాలు వ్రాస్తావు' అన్నాడు. సుధామణిని గురించి నా అభిప్రాయం అడిగాడు.

'నే నింకా ఏ అభిప్రాయమూ ఏర్పరచుకోలేదు. అసాధారణ వ్యక్తిగా మాత్రం కనిపించింది' అన్నాను.

'వాళ్ళకి సంతానం లేదు. అదొక లోటు. అది మరిచిపోవ డానికే యీ ప్రేమకోసం వేట – చిత్రం – మళ్ళా భర్తంటే ఎంతో ప్రేమ. అతనికి అపచారం చెయ్యలేనంటుంది. కదిపా వంటే అన్నీ చెప్పేస్తుంది. కబుర్లతో నిన్ను లోబరుచు కుంటుంది. అదే ఆమె ఆనందం.'

'అంత సుళువుగా ఆనందం సాధించగలగటం గొప్ప అదృష్టం. నిన్నుకూడా లోబరుచుకుందా?'

ఈ ప్రశ్నకి సమాధానంరాకముందే వాళ్ళ కార్యదర్శి కారులో వొచ్చాడు. ముందు బైటకి వెళ్ళవల్సిన పనుందనీ, మరో గంటలో కార్యదర్శితో కలిసి తనఆఫీసుగదికి రావల్సిం దనీ చెప్పి, అతను వెళ్ళిపోయాడు.

మరో జీపులో 'విక్రమభట్' అనే మరోవుద్యోగి అతనితో షికారుకి రమ్మన్నాడు. బైలుదేరుతుండగా డాక్టర్ హరికృష్ణ కా రొచ్చింది. వాళ్ళనౌకరు ఆ కార్లో వారింటికి రావల్సిందిగా సుధా మయిగారు కోరినట్లు చెప్పాడు – 'నాటకంవిషయం మాట్లాడా లటండీ' – అన్నాడు. సాయంత్రం నాటకం – ఇంతవరకూ దాన్ని గురించి ఎవరూ పట్టించుకున్నట్లు లేదు. సుధామయితో మాట్లాడాలని వుంది.

ఓ గంటలో వారింట్లో దింపుతానన్నాడు విక్రమభట్. గంటలో వొస్తానన్నారని చెప్పమని సుధామయినౌకర్ని పంపించివేసి, జీపులో బైలుదేరాము. అవీ యివీ మాట్లాడు కున్న తర్వాత, విక్రమభట్ సుధామయిని గురించి సంభాషణ మొదలెట్టాడు. లోపల కుతూహలం వున్నా, దాన్ని కనబర చక, వారు చెబుతున్నారు కాబట్టి వింటున్నాననిపించేటట్లు,

చిన్నచిన్న ప్రశ్నలతో వ్యాఖ్యానాలతో కొన్నివిషయాలు సేకరించాను. వెనకాల కూర్చున్న కార్యదర్శి వింటూ కూర్చు న్నాడు. విక్రమభట్ యిలా చెప్పాడు.

'సుధామయిని గూర్చి బోలెడు వదంతు లున్నాయి. ఇందులో సగం ఆమెనిచూసి ఓర్వలేని స్త్రీలు సృష్టించినవి. మిగతా సగం ఆమెలో నైతికనిజాయితీని ఒప్పుకోలేక తమ ఓటమిని సమర్థిస్తూ సృష్టించిన దుష్ప్రచారం. ఆమె చాలా మంచిది. నవ్వుతో, చూపుతో, స్నేహంతో మొగాళ్ళని సంతోషపెడుతుంది. - సూర్యరశ్మిలా అందరిపైనా సమంగా ప్రసరిస్తుంది ఆమెలో వాత్సల్యం. శరీరానికీ, మనస్సుకీ తేడా తెలీని పాతివ్రత్యం అనొచ్చు - '

'ఇవన్నీ మీ కెల్లా తెలుసు?'

'నే నిక్కడ నాలుగేండ్లనుంచి చూస్తున్నా. నే చూసిందీ, విన్నవీ - యివన్నీ కలబోస్తే వొచ్చినభావం. ఈ మన స్తత్వానికి కొంతవరకూ భర్త కారణం. దొరలపార్టీల కెళ్ళడం, అక్కడ నృత్యాలు - నాగరికులు అసూయప్రకటించ కూడదుగా మరీ! - పరాయివాళ్ళతో చనువుకి శరీరం ఆటం కం అవకూడదుగా, పాశ్చాత్యనాగరికతలో...'

'అన్యాయం - వాళ్ళల్లోనూ వుంది బోలెడంత నైతిక చింతన.'

'క్షమించండి - పోనీ - శరీరం ఆటంకం అవకూ డదన్నట్లుగా నటించాలి - అసి సరిదిద్దుతాలెండి. ఆ అలవాట్లని పురస్కరించుకుని కాంతారావుగారు చొరవ తీసుకుని, హైకంలో ఏదో చెయ్యబోయ్యాడట - ఆమె లెంపకాయ

కొట్టినంతపని చేసిందిట. ఆ చర్యకి భర్తకూడా కోపగించు కున్నాడు. పై అధికారిపైన అల్లా చెయ్యిచేసుకుంటే తమ భవిష్యత్తేంకాను - అని చాలా గొడవపెట్టాడుట. అదే కిందధికారైతే అసూయ; పైఅధికారైతే నాగరికమైన వోరిమి! పై అధికారి గనకనే దూరంగా వుంచానందిట.'

ఆఫీసు, పని, లాభనష్టాలు - మొదలైనవాటిని గురించి వో అరగంట చెప్పుకున్నాం. నేనూ, కార్యదర్శీ ఆఫీసులో దిగిపోయ్యాం. కాంతారావుగదికేసి వెడుతూండగా, కార్య దర్శి కొన్నిసంగతులు చెప్పాడు.

'మీ కో విషయం చెబుతా, నమ్ముతారా? ఈ కంపెనీ కాలనీలో అందరికంటే ఎక్కువ సంస్కారం, నిజాయితీ గల మనిషి సుధామయి. అంతటి సంస్కారం గల పురుషులతో సమంగా మెంచబడాలని, వారిస్నేహం కోరుతుంది. అది కేవ లం మానసికమే. కాని మొగాళ్ళకి స్త్రీలతో మానసిక స్నేహం అర్థంకాదు - మన సమాజంలో ముఖ్యంగా పరపురు షుడితో శారీరకంగా కాక మరోరకం సంబంధం సాధ్యమని ఎవ్వరూ నమ్మరు. అందుచేత ఆమె కనపరచే చనువూ, ఆద రణ వుదహరించి, యిదంతా శారీరకమైందేనని, పురుషులు చేస్తున్న ప్రచారం. స్త్రీల అసూయాభావం దీనికి ప్రోద్బలం. ఆమె నిజంగా కోరింది, ప్రేమించింది, తోటమాలి తార కాన్నే. తారకం - భర్తగారింట్లో చిన్నప్పటినుంచీ వుండే వాడు. అయ్యగార్ని తన ప్రాణంగా చూసుకునేవాడు. నల్లగా, కండలు తిరిగిన ఉక్కుశరీరం;వొత్తైన వుంగరాలజుత్తు. ఎందు కంటారు? వాడి కేవిధమైన సంస్కారం లేదు. సహజ

మైన ప్రవర్తన – పుద్రేకాలే విజ్ఞానంగా మారిన ప్రకృతి. మానసికమైన తికమకలు లేవు. వ్యర్థమైన ఆలోచనలతో మనస్సు మలినంచేసుకోక ప్రతిక్షణమూ, సర్వేంద్రియాల సంచలనంతో సజీవుడైన వ్యక్తి. ఆమెకి సంతానం కావాలి. శరీరం శాసించిన సహజవాంఛలను అణిచిపెట్టి కృత్రిమమైన ప్రతిభగా మార్చుకున్న మేధావులకి సంతానం కలుగదు.

ఇంకా చెబుతూండగా కాంతారావ్ కనిపించాడు. సెలవుతీసుకొని తనవని చూసుకుంటానని కార్యదర్శి వెళ్ళాడు. కాంతారావ్ తనఆఫీసు – అక్కడజరిగేపని, పనివాండ్రకి వారు కలగచేసిన సౌకర్యాలు, వేడుకలు, ప్రసూతి ఏర్పాట్లు, పిల్లలకి పాలు, రీడింగ్‌రూమ్, ఆటస్థలం, హాస్పిటల్, పార్కు, అక్కడి యంత్రాలు – యివన్నీ చూపించాడు. పార్కులో వొకమూల ఖాళీచేయించి, వొక వేదిక, దానిమీద 'డేరా', సాయంత్రం కార్యక్రమానికి ఏర్పాటుచేశారు. ఆహ్వానితులకు బెంచీలు, కుర్చీలు, చాపలు వేశారు.

'మరి వేషాలకి గ్రీన్‌రూము ఏదీ?'

'అడుగుదాం' అని కాంతారావ్ 'స్వామిని' పిల్చాడు.

'అదే తెవల్డం లేదండి. రీడింగురూమ్ దగ్గర్లో వుందండి. అక్కడ వేషాలేసుకుని, కార్లోకూర్చుంటే, – ఆ కారుని స్టేజికి దగ్గరగా వుంచుతామండి. అందులోంచే వొస్తూ, పోతూ వుంటారండి.'

'మరి కర్టెన్లూ అవీ ఏవి?'

'తయారవుతున్నాయండి. గురవయ్యగారి హార్మోనియం చెడిందండి – రిపేరుకెళ్ళింది, అదీ, కర్టెన్లూ వొకేసారి

వొస్తాయండి' అన్నాడు స్వామి. ఇంతలో కాంతారావ్ టైపిస్టు 'లూసి' వొచ్చింది. నారింజరంగు పొడుగాటి గౌను. కత్తిరించిన వుంగరాల జుత్తు. నడుంకి వెడల్పుబెల్టు. తన చాక క్యం, పనిలో ప్రావీణ్యం అంతా రొమ్ములద్వారా ప్రదర్శింపగల, ముచ్చటైన విగ్రహం. సుధామయిగారు నన్నూ కాంతారావును వారింటికి రావల్సిందిగా ఫోనులో చెప్పారుట.

'ఉదయం కారు పంపింది – నాటకం విషయం ఏదో మాట్లాడాలి రమ్మని' అన్నాను.

'కొంపతీసి నాటకంలో తనే వేషం వేస్తానంటుందా ఏం!' అంటూ కాంతారావ్ నవ్వడం సాగించాడు.

'నిన్నుకూడా రమ్మందిగా.' అన్నాను.

'ఇదోరకమైన ముఖస్తుతి. ఆమె భర్తకి ప్రమోషన్ కావాలట. మా పూనా బ్రాంచిలో ప్రధాన సంక్షేమాధికారి వుద్యోగం ఖాళీ వొచ్చిందిలే. హరికృష్ణకి అది యిప్పించమని సూచనలుచేసింది. ఈ వుద్యోగంలో కొచ్చి రెండేళ్ళు కాలేదు. అప్పుడే మళ్ళా ప్రమోషనా!'

ఇక్కడి వ్యక్తులందరూ, నన్నింతగా ఆదరించడానికి కారణం కాంతారావ్‌ని నే నెరుగుండడమే ననిపించింది. ప్రతి వారూ ఏదో కొంత చెప్పి, నా మంచి పొంది, కాంతారావు ద్వారా ఏదో మంచి మాట్లాడి వారికి మేలుచేస్తానని లోపలి భావం. సుధకూడా యిలా మంచిచేసుకోవడానికే రమ్మందేమో! కాంతారావ్ పెద్దధికారి; ఇతరులపట్ల అతనిదృక్పథం వేరు. ఎవరు తనతో మంచిగావున్న, వా రేదో మేలు తనద్వారా ఆశిస్తున్నారనే. నే నెందుకల్లా గనుకోవాలి? నాటకం విషయం

మాట్లాడాలనికూడా అంది సుధామయి. కారణం ఏదైతేనేం, వెళ్ళాలని వుందినాకు. 'భోజనాలైనాక విశ్రమించి, మధ్యాహ్నం వెడుదువుగానిలే.' అన్నాడు కాంతారావ్. పన్నెండింటికి అతని పని ముగించుకుని బంగళాకెళ్ళి, భోజనాలుచేశాక అతను కాసేపు విశ్రమిస్తానన్నాడు. కొన్నిపత్రిక లిచ్చి, నన్నూ విశ్రమించమని చెప్పి తనగదిలో కెళ్ళాడు.

నాకు నిద్ర పట్టలేదు. రాత్రి నిద్రలేక అలసిన మాట నిజమే. అది నరాల అలసట వారికి వుద్రేకం కావాలి, విశ్రాంతి కాదు.ఇంకా నిద్రలేకుండా యింకా అలిసిపోయి, నాడీ, నీరసించి, ప్రాచీన శిథిలంగా చెయ్యందే విడువదు. విప్లవంచేసిన నరాల వొత్తిడి. మూడింటికి టీ పుచ్చుకున్నాను. తను వేరేపనిచూసు కుంటానని, తన కార్లో సుధగారింటికి వెళ్ళమని ఏర్పాటు చేశాడు కాంతారావు. వాళ్ళబంగళాముందు కారు నిలిచింది. నేను ఫలానా అని తెలుసుకున్నాక నౌకర్లు లోపలిహాల్లోకి తీసుకెళ్ళి, 'ఆమె యిప్పుడే బైటకెళ్ళారు. వొస్తూవుంటారు. కూర్చో' మన్నారు. కూర్చున్నాను. కాఫీపొడుంరంగు బొచ్చు కుక్క వొకటొచ్చి, కాసేపు మొరిగి నా కాళ్ళముందు ముడు చుకుని పడుంది. ఇంతలో కారు నిలిచినచప్పుడు. ఆమె రానే వొచ్చింది. కుక్కకి భయపడి నేను లేవలేదు. చప్పుడికి గంతు లేసుకుంటూ వెళ్ళింది నేను లేచాను.

'చూశావా మా 'శాంతి' ఎంత శాంతంగా పడు కుందో. చెడ్డవుద్దేశాలువున్న వ్యక్తిగనక వొస్తే పసిగట్టి చీల్చి చెండాడేస్తుంది. మీ హృదయం మంచిది కాబట్టి అల్లా బుద్ధి మంతురాలుగా పడుంది.' అంటూ లోపలి కెళ్ళింది. నా

హృదయం అంత మంచిదా? నిజంగా అంత మంచిదైనా అయి వుండాలి - లేక కుక్కకి పసికట్టేశక్తి క్షీణించేనా వుండాలి- అనుకుంటుండగా ఆవిడ వొచ్చింది. నౌకరు బల్లమీద కూల్ డ్రింక్స్ పెట్టాడు. వొచ్చిన ఉత్తరాలు విప్పి వెలుతురులో కొచ్చి కళ్ళు పెద్దవిచేసి చదువుతోంది. ఆమె కళ్ళు అంత పెద్దవికావు. కనురెప్పలలో వొకటి రెండు వెంట్రుకలు లేవు ఆ ఖాళీలోంచి వింతనీడ బుగ్గలమీద పడుతోంది; ఎండ లోంచి రావడంవల్ల చెమటపట్టింది. అరచేత్తో జుట్టుని పైకి తోసినప్పుడు, చెమటకి ముంగురులు తడిసి నుదిటిమీదే అతు క్కున్నాయి. బల్లమీది భూతద్దం సహాయంతో వుత్తరం చదువుతోంది.

'ఏమండీ, కండ్లజోడు పెట్టుకోరాదా?'

'మా వుద్యోగానికి ఏలోటున్నా పట్టించుకోరు కాని, చూపుమాత్రం బాగుండాలి. అంచేత ఎంత చత్వారం వొచ్చినా, ఎవ్వరూ కండ్లజోడు పెట్టుకోరు. అందరూ అంధు లైతే ఎవరు అంధులో కారో చూసి తెల్సుకోలేరుగా' అన్న దామె, వుత్తరాలు దూరంగా వుంచి, సోఫాలో కూర్చుని, పమిటతో మొహం తుడుచుకుంటూ. చెమటకి జాకెట్టు మెడ తలదగ్గర డాగైంది. - తేనె పరిమళం నన్నావహించింది. నాచూపుని ఆమె గ్రహించినట్లుంది.

'నా చివరికోరిక చెప్పమంటారా? దోమలు, యీగలు లేని దేశంలో, చెమటపట్టని దేశంలో పుట్టించమని. ఇప్పుడే వొస్తా - యీలోగా యిల్లు చూస్తూ వుండండి' అని నౌకర్‌కి సంజ్ఞచేసి లోపలికెళ్ళింది.

నేనూ, నౌకరూ ఇల్లంతా చూడ్డానికి బైలుదేరాం. చుట్టూ కాంపౌండు-గోడ; మూలగా వో చిన్నగది. అందులో కుంటేళ్ళు - వొక లేడి; గదిముందు వరండాలో పంజరం, రామచిలుక-మరోమూల మైనా; లోపల గదిలో పావురాల గూడు; లోపలహాల్లో నాలుగు తైలవర్ణచిత్రాలు - ఒకటి ఆమెతల్లిది; మిగతావి 'లాండ్‌స్కేప్స్.' కొన్ని ఫోటో లున్నాయి. ఒకదాంట్లో చిన్నప్పుడు హరికృష్ణ వున్నాడు. అప్పటికే జుట్టు వూడే సూచన లున్నాయి. పెరిగిపొయ్యే శరీరం తాలూకు పొంగూ, దబాయింపూ వున్నాయి. మరో దాంట్లో సుధామయి యవ్వనదశలోది. - ఇరవైయ్యేంటా యేమో? అందులో అంత బాగుండలేదు. నుంచున్న పద్ధతిలో ఠీవి, నిబ్బరం, మానసిక శిక్షణకి గుర్తై పరిసరాలని లోబరచుకో గల ధీమా అందులో లేవు. - ఏమిటో సగం మనిషిలా వుంది! కొందరికి పెద్దయింతర్వాత గాని నిండుతనం రాదు. మనో వికాసం శరీరానికి కూడా కొంత శక్తినిస్తుంది కాబోలు!

'కాంతారావ్ గారు రానన్నారా?'

సుధామయి ఎర్రసిల్కుచీర ధరించింది. బోర్డరు లేదు- అందుకే ఎత్తరిగా కనబడింది. నడుంచుట్టూ వొంపుమీద చీర మడతలు లేనందున కంచుకూజాలా నీడలో మెరుస్తోంది; హాండ్‌లూమ్ బాతులు, కొంగలు బొమ్మల డిజైన్‌గల తెల్ల జాకెట్టు. - మెడకి సూర్యకిరణాల నెక్లెస్ లేదు. అదున్న భాగంలో వొకచోట మానిన గాయంగుర్తు- అటుకేసి చూస్తు న్నాను.

'అర్జెంటుగా జరగవల్సిన కంపెనీపనుందట - క్షమించ మని చెప్పమన్నారు.'

'ఈ కంపెనీకి అవశ్యం జరగాల్సిన పని ఏమిటంటే, దీన్ని ఎత్తివెయ్యడం.'

'ఏమిటండీ అల్లాగంటారు? బోలెడు బోనస్ యిస్తున్నట్లు విన్నాను' అన్నాను.

'ఇస్తారు. మళ్ళీ రెండేళ్ళు, నెలాఖరుకి జీతాలు రావడం వుత్తది. - మెడమీద గాయం లెండి - చిన్నప్పుడు నేనూ అక్క పరికిణీలకోసం కీచులాడుకున్నాం - తోసింది - కత్తిపీట మీద పడ్డాను. ఇది చూశారా చిటికెన వేలు-పైన ముక్క వూడింది - స్కూల్లో పిల్లలతో దెబ్బలాట ఫలితం. మరేమో యీకనురెప్పలు డాక్టర్ గారివని - సిగరెట్టు కాలింది. ఎందుకో ఆ వొకటీ రెండూ మళ్ళా ఎదగనే లేదు! ఈ మోకాలుపైన దీపావళినాడు సీమటపాకాయగుత్తి పేలిన కాల్పు లున్నాయి. మీకివన్నీ తెలిస్తే పారిపోతారు. కాంతారావ్ గారు మా యింటి కింద కొస్తారు లెండి - పెద్ద వుద్యోగి. అయినా రాకపోవడమే మంచిది లెండి - మిగతావాళ్ళ ఏడుపైనా తగ్గుతుంది. చిత్రం చూశారూ! సమాజం మనచేత కొన్ని చెడ్డపనులు చేయిస్తుంది. నాలుగైదుసార్లు ఒకాయన, వొకా మెతో చనువుగా వుంటున్నా డనుకోండి, యితరు లేమీ అనుకునే అవకాశం రాకుండా, వారిద్దరూ చా జాగ్ర త్తగా వుంటారు. అంతమాత్రంచేత వాళ్లు అనుకోడం మానరు. పైగా పెరుగుతుంది; పరిపరివిధాలుగా చెప్పుకుంటారు. అది వారిచెవులో పడుతుంది. జాగ్రత్తగా వున్నా యీ వదం

తులు పోలేదుగనక, యింత జాగ్రత్తగా వుండకపోతే మాత్రం జరిగే దేమిటిలే– అనుకుని గ్రంథంలోకి దిగుతారు. – అన్నట్లు మీరు గ్రంథకర్తగా – అల్లా అనివుండకూడదేమో!' లోపలి గదిలో వొక 'పెట్టె'–పరుపు మంచం లాంటిది వుంది, ఆమె దానిమీద కూర్చుంది. ఎదురుగుండా వ్రాగిసలాడే కుర్చీలో నన్ను కూర్చోమంది. నా కందులో బాగాలేక, ఆమెనే అందులో కూర్చోమని, నేను పక్కసోఫామీద కూర్చున్నాను. రెండు గ్లాసెస్ తెచ్చి అందులో ఏదో వైన్ పోస్తోంది. పాదాల కేసి చూశాను. మడమదగ్గర మరో మానినగాయం కనబడింది.

'ఇదా, వెన కోసారి వొకళ్ళింటికి వెళ్లాం. వాళ్ళకుక్క మీద కొచ్చింది. దువ్వబోయాను. పాదం కటుక్కున కొరికింది. ఇట్టే పసికట్టేస్తాయి. లోపల భయపడి పైకి ధైర్యంగా వున్నట్లునటించ బోయామా, ఆ లోపలిభయాన్ని పసికట్టి, చర్యతీసుకుంటాయి.'

ఆమెని జీవితం – మనుష్యులు, జంతువులు ఎన్నో విధాలుగా హింసపెట్టడం చూస్తే జాలేసింది.

'పుచ్చుకోండి' అంటూ గ్లాస్ నా చేతి కందిచ్చింది.

'నన్ను క్షమించండి. నా కేదైనా టీయో, కాఫీయో యివ్వండి. నా కలవాటు లేదు. నోటికి బాగుండదు. పైగా లైసెన్సు లేదు' అన్నాను నవ్వుతూ. ఆమె లేచి నిలబడి నా సోఫామీది కొచ్చి, వొక చేత్తో నాగడ్డం పైకెత్తి, గ్లాస్ నోటి కందిచ్చింది. సోప్, టాల్కంపౌడరు, యార్డ్లి సెంట్ పరిమళం, శ్వాసలో తేనె పరిమళం నన్నుక్కిరి బిక్కిరిచేశాయి.

'నాకోసం పుచ్చుకోరూ?' అని దీనంగా చూసింది.

'ఒంటిగా త్రాగడం కంటె, నాగరికతపట్ల అపచారం లేదు. ఇదేం చెయ్యదు. మీకు నచ్చుతుంది.'

కాస్త తీసుకున్నాను.

'ఉండండి, టిఫిన్ తెప్పిస్తా' అని లోపలి కెళ్ళింది. మూలగా రేడియోగ్రామ్ వుంది. దానిమీద ఫొటోస్టాండులో మూడుబొమ్మ లున్నాయి. ఒకటి 'తోరుదత్తు' పెన్సిల్ చిత్రం, మరొకటి 'అమృతషెర్గెల్' ఫొటో, మూడోది 'పావ్లోవా బాలె' నృత్యభంగిమ ఫొటో. నర్తకి, చిత్రకారిణి, కవయిత్రి-ఆ ముగ్గురూనూ.

ఆమె వొచ్చింది. టిఫిన్ తెచ్చాడు వంటాయన కాబోలు.

'మీకు కళ లంటే చాలా అభిరుచి అనుకుంటా' అన్నాను.

'మనం చెయ్యలేని పనులను చేసినవారిపట్ల వుండే ఆరాధనాభావం కాబోలు. నిజంగా నా కేమీ అభిరుచి లేదు. వారి జీవిత చరిత్రలు చదివాను. అవంటే ఎక్కువ యిష్టం నాకు. తోరూదత్తు చిన్నప్పుడే చనిపోయింది. ఆ కాస్త జీవితంలో ఐదారు తరాల మానసిక పరిణామాన్ని తనలో వ్యక్త పరిచింది. ఆమె నర్తకైతే, పావ్లోవాలాగై య్యేది. చిత్ర కారిణైతే, అమృత షెర్గెల్లా గయ్యేది. ఆ ముగ్గురూ ఏరంగంలోవున్నా వొకేలా కళాసృష్టి చేసివుండేవా రనుకొని తృప్తిపడతాను, ఎటొచ్చీ నాలో కళమాత్రం లేదు. అదంతా జీవించడంలో ఖర్చయిందేమో తెలీదు, మీరు చెప్పాలి.' అంది సుధ.

నే నేమీ మాట్లాడలేదు. స్త్రీల చిత్రపటాలుండొచ్చు.

కాని, వొకటి రెండు పురుషుల చిత్రపటాలు లేకపోవడం చూసి కొంత చిన్నబుచ్చుకున్నాను. పైకన్నాను:

'స్త్రీలవిషయం, పురుషులకంటె స్త్రీలకే ఎక్కువగా తెలుస్తుందేమో! పురుషుడికి తెలిసినా, తనవూహలో దానికి క్రొత్త అర్థం, స్వరూపం కల్పిస్తాడనుకుంటా. స్త్రీలు నిజంగా ఏమనుకుంటున్నారో పురుషులకి తెలిస్తే యింతకంటె ఇరవై రెట్లు తెగిద్దురు.'

'మీరు చెప్పింది నా కర్థంకాలేదు. – ఆ తికమకలు నాకు తెలీవు సుమాండి.'

'ఏం లేదు – ఇక్కడ పురుషుల బొమ్మలు ఎందుకు లేవా? అని' అన్నాను.

'పురుషత్వంలో కాఠిన్యం, క్రౌర్యం, కళాసృష్టికి యిది చాలా అవసరము. తోరుదత్తు, అమృతషెర్గెల్, పావ్లోవా లలో కూడా కొంత కాఠిన్యం వుంది. వా రందుకే గొప్ప కళావేత్తలు కాగలిగారు. నాలో ఆ కాఠిన్యమే లోపించడం మూలాన, పీరినే తల్చుకొని లోలోన ఆనందిస్తానేమో! ఆ కళాశక్తిని జీవితంలో వినియోగించుకోడంలోనే ఆనందం పొందుతాను. కాని అది మన సమాజంలో సాధ్యంకాదు. ఎవరేనా మనలో సంతోషంగా వుంటే, వా రేదో అపచారం చేసినట్లు భావిస్తారు. నా కిల్లా మీబోటివారితో కళలనిగురించి మాట్లాడుకుంటూ వుండాలనిపిస్తుంది. కాని అది వీలంపడదుగా.'

ఆమెకళ్ళలో ఏదో దిగులు నల్లమేఘంలోంచి వూడిపడ్డ మంచుకణంలా మెరిసింది. వేడి 'టీ' కి చెమట్లుపోసి, పౌడర్ తెలుపుని తొలగించి, జారిన కన్నీరుతో కలిసి, నీళ్ళల్లోపడ్డ వర్షంచినుకు అల్పమైన కెరటాన్ని లేవదీసి, గుండ్రంగా పెద్దదై

పొద్దున విడినట్లు, మెడచుట్టూ జుత్తులో నిలబడి, విరిగి పడి పోతున్నాయి.

'కళవల్ల కలిగే ఆనందంకంటే గంభీరమైనదీ, శాశ్వతమైనదీ ఆధ్యాత్మికచింతన అంటారు పెద్దలు.'

'నేను ఏ ఆనందం మరొకదానికంటె గొప్పది అనను వేరు వేరు రకాలు. వాటిలో తీవ్రత, తీక్షణం, అది పొందే వారినిబట్టి వుంటుంది.

నే నేమనాలో తెలీలేదు. కళాసృష్టికి స్త్రీత్వం పురుషత్వం రెంటిసమ్మేళనం అవసరమనీ, స్త్రీత్వం వాస్తువనీ, పురుషత్వం ప్రేరణనీ, జర్మన్ మానసికశాస్త్రజ్ఞుడు సి. జి.యూంగ్ వ్రాసిన సంగతి స్ఫురణకొచ్చింది. కాని, అదంతా ఎల్లా చెప్పాలో తెలీదు.

'ఇంతకీ నాటకం విషయం మాట్లాడాలి అన్నారు?' అన్నాను.

'అల్లాఅంటే వొస్తారని అన్నాను. నిజంగా మాట్లాడాల్సిందికూడా వుందిలెండి' అని వరండాలో కూర్చోడానికి కుర్చీలు అవీ ఏర్పాటు చేయిస్తోంది.

'చెప్పండి' అన్నా నో కుర్చీమీద కూర్చుని.

'ఏంలేదు – రాత్రి మీ నాటకంలో నో పాత్రవేసే పామెలారిపోయింది.'

నాకు దిగులేసింది. ఏదో ఒక్క నాటకం వ్రాశాను. ఎన్నో అనుకూల పరిస్థితులు ఏర్పడి, దాన్ని వేసేప ర్పాటైంది. ఎన్నెన్నో కలలుకంటూ కూర్చున్నాను. సూర్యుడి కాంతిలో వుండికూడా, కనబడని, నక్షత్రాలకిమల్లే – ఆ కలలు ఘనీ

భవించి, ఈజిప్టులో పిరమిడ్లకి మల్లే అల్లా నా కనురెప్పలమీద శిథిలాలై, ముందుయుగాల పురావస్తుశాస్త్ర పరిశోధకులకు కానుకగా అర్పణ కావాల్సిందే!

'ముఖ్యమైన పాత్రా?'

'చాలా చిన్నదే – అంతా పదినిమిషాల ఘట్టం. ఆఘట్టం మట్టుకు నాటకానికి ఆయువుపట్టు.'

'తీసెయ్యడానికి వీలులేదూ?'

'అమ్మో'

అని తలపంకించాను. అయినా, నేటి నాటకసమాజాల స్థితిగతులు తెలుసుకోకుండా, యిద్దరు స్త్రీపాత్రలతో నాటకం ఎందుకు వ్రాయాలి? నామీద నాకు కోపంవొచ్చింది.

'మరో స్త్రీపాత్ర వుందటగా – పద్మ వేస్తోందట.'

'అవును.'

'ఆమెచేతే యిదికూడా వేయించకూడదూ?'

'ఆవిడ వొచ్చే సమయంలో యిద్దరుగా ప్రేక్షకులకు కన బడే దివ్యత్వం వుంటేగాని అది సాధ్యపడను. ఇద్దరూ వొకే రంగంలో వొస్తారు.'

ఆ పాత్ర, ఆ ఘట్టం మార్చివేసే విషయం గురించి, అప్పుడే నా బుర్ర రహస్యంగా ఆలోచనలు సాగిస్తోంది. అల్లా మార్చిస్తే కళాసాధనలో నిజాయితీని ఆక్షేపిస్తారేమోనని వో మూల బెదురు.

'ఏ కుర్రాడిచేతో వేయిస్తే?'

'అంతకంటె నాటకం మానివెయ్యడమే నాకుసమ్మతం.

ఇంతకీ డాక్టరు హాకెకృష్ణగారేరీ?' అన్నాను. ఆయనవుంటే ఏదే నా చేసేవాడన్న ధ్వని కలగచెయ్యాలని.

'ఆయన కోర్టులో సాక్ష్యం యివ్వడాని కెళ్ళారు. చీకటి పడకముందే వొస్తారు.'

'ఇంతకీ పారిపోవడం దేనికి – రేపుదయం వరకూ ఆగ కూడదూ!' అన్నాను.

అక్కడినుండి లేచి హాల్లో కొచ్చాం. ఎదురుగా వున్న గదిలో పేముకుర్చీలమీద కూర్చున్నాము. సీసాలల్లో వైనో ఏదో పోసి నా కో గ్లాసిచ్చింది. ఇది పుచ్చుకుంటే ఆందోళన, మనోవ్యాకులత తగ్గుతాయంటారు. పుచ్చుకుందామని నిశ్చ యించాను.

'అన్నట్లు మరిచాను – మీ కిష్టంలేదుగా. బలవంతం చేస్తున్నానేమో–క్షమించండి' అని నా చేతులో గ్లాసు తీసు కుని తనే తాగేసింది. మరో గ్లాస్ కూడా పుచ్చుకుంది.'విషయం చెప్తాను. ఆమె బృంద – ఇక్కడ మా గుమాస్తా గోవిందం భార్య. పెండ్లయి ఏడెనిమిదేళ్ళయిందట. సంతానం కలగలేదు. రెండురోజుల క్రితం వేవిళ్ళు ప్రారంభమైనాయిట. దానికి కారణం తాను కాడట.'

'ఎవరిమీదేనా అనుమానం వుందా?'

'అనుమానం ఏమిటి – దాఖలా వుందంటున్నాడు. మావారేట. ఏం చెప్పనుంటారు?'

ఇద్దరం మౌనంలోపడ్డాము. నే నీ నాటకం ఎందుకు వ్రాయాలి – ఈ మహా గంద్రగోళంలో ఎందు కొచ్చిపడాలి!

'డాక్టరుగారూ అదీ కలిసుండటం చూశాడట – హాస్పిటల్‌లో సంక్షేమభవనంలో. ఈవాళ నాలుగూ అడిగేశాడట. వొదిలేశా అవతలకి పొమ్మని, పెట్టె, మూట బైటగిరవాటెట్టాడట. బస్సులో పుట్టింటికి పోయిందిట. అదుగో గోవిందు వొచ్చిన ట్లున్నాడు. రా గోవిందు.'

గోవిందు ఎర్రగా, పొట్టిగా వుంటాడు. బుష్‌కోటు, ఆకుజోళ్ళు, విరిగిన క్లిప్పుగల కలం జేబులో – కోటుకాలర్ మధ్యలోంచి వెంట్రుకలు, చేతులకి వొత్తుగా పెరిగిన వెంట్రుకలు – అదీ వాలకం.

'ఏమిటి గోవిందూ! డాక్టరుగారే యీ పని చేసిందంటున్నావట?'

'నే నామొక్క ఎవ్వరితోనూ అనలేదండి. అంటే నా వుద్యోగంమీద ఆశ వొదులుకోవాలండి. నేను చెప్పినా ఎవ్వరూ నమ్మరండి. అందులో సంక్షేమాధికారి.' అదోలా నవ్వాడు. గారపట్టిన వొకటి రెండు పళ్ళు ఆ నవ్వుకి పదునిచ్చాయి.

'నువ్వే తండ్రివి ఎందుకు కాకూడదూ? నీకు తెలీదు. డాక్టర్ల నడుగు చెప్తారు కొంతకాలం జరిగాక, శరీరంలో మార్పులొస్తాయి. అప్పుడు సంతానం కలగడంవుంది. ఆధారంలేని యీ పిచ్చినమ్మకంతో, ఆమె జీవితాన్ని, కలగబొయ్యే సంతానాన్ని పాడుచెయ్యడం మంచిదికాదు. నామాట విను. పదినెల్లాగు. పిల్లో పిల్లోడో పుడుతాడు. పోలిక తెలుస్తుంది. అప్పుడు చర్యతీసుకో. నీ అనుమానం నిర్ధారణైతే, ఆ పిల్లని నే పోషిస్తాను. ఆమెను యిక్కడే వుంచి చూస్తాను. అందుకు సమ్మతం కాకపోతే వెల – కింతా అని కొంత ముట్టచెప్పించే

ఏర్పాటుచేస్తాను. వెళ్ళు - తక్షణం రెడ్డిగారి జీప్ తీసుకొని వెళ్ళి, ఆమెని తీసుకురా. ఎనిమిదికల్లా వొచ్చేసెయ్యాలి. నాటకంలో వేషం వేస్తుంది. స్క్రిప్టు అంతా చదివిందట. ఇదుగో ఈయనే నాటకం వ్రాసినాయన.'

గోవిందు గడబిడచేసి వాదిస్తా డనుకున్నాను. అల్లా గేమీ చెయ్యలేదు. సరేనని వెళ్ళిపోయాడు. తను గుమ్మంలో కెళ్ళి అతనిచేతిలో కొంతడబ్బు పెట్టింది సుధామయి. గోవిందుకు వుద్యోగంపై తీపి నా కాశ్చర్యం కలగజేసింది. కీర్తి, ప్రేమ-ఈ రెంటికంటె విత్తానికే ఎక్కువ పలుకుబడి, ప్రభావం వుంది. అందుకనే ధనికులంటే నా కిష్టం కాబోలు!

'అమ్మయ్య' అని నిట్టూర్చాను.

'నా కా ధైర్యంలేదు. వాడు సమయాని కొస్తాడని తోచదు. వీడు వెళ్ళాలి. ఆమె దొరకాలి. బతిమలాడాలి. ఆమె అంగీకరించాలి. నా కేం నమ్మకంలేదు. రాగానే మావార్ని కూడా పంపుతాను' అన్నది సుధ.

'ఇదంతా నిజమంటారా?'

'నా కేం తెలుసు - పురుషుల మాటలు, చేష్టలు, ఆదర్శాలు, ఆచరణ! డాక్టర్ గారు తన మగతనం ఋజువుచేసుకోడానికి సమకట్టారేమో! ఆయన సంక్షేమం చూసుకున్న తర్వాత కదా, యితరుల క్షేమం చూడటం - చెయ్యనిదాన్ని బట్టి స్త్రీ శీలాన్ని, చేసినదాన్ని బట్టి పురుషుని శీలాన్ని తెలుసుకోవొచ్చు.'

సాయంత్రం ఐదు గంటలు దాటింది. మరి కొంచెం టీ తెచ్చి త్రాగమంది. నే వెడతానని లేచాను.

'ఏం దిగులుగా వున్నారేం?' అన్నదామె.

'మీరు దిగులుగావుండటం చూస్తే నాకు దిగులుగా వుందేమో!'

'ఇట్లా రండి'

లోపలి కెళ్ళాను. రెండుచేతులూ నా గడ్డంకింద పెట్టి, పైకి తోసింది. మీ నాటకానికి భయంలేదు. ఒక నిశ్చయానికొచ్చా. ఆ వేషం నేనే వేస్తున్నాను.' నే నదిరిపొయ్యాను. గుండెలు వేగంగా కొట్టుకుంటున్నాయి. చెమట్లుపోశాయి. నుదుటిమీది చెమటని చేతులతో తీసేసింది.

'నిజంగా –! మీ కెందు కింత...'

'ఏమో – మనం కళనిగురించి చెప్పుకున్న కబుర్లే కారణమేమో!'

'మరి మీకు వేషం ఏమిటో తెలీదు, నాటకం చదవలేదు. ఎప్పుడు కంఠస్తంచేస్తారు?' అని అడిగాను.

'ఇప్పటి సాంఘికనాటకాల్లో పోర్షన్ కంఠస్తంచేసే అవసరం వుండదు. రంగంమీద కుర్చీలు, బల్లలు, పుస్తకాలు వుంటాయి. వాటిమధ్య నాటకంలో తనభాగం వ్రాతప్రతి పెట్టుకొని చూసుకుని, చెబుతూవుండవచ్చు. వెళ్ళి నాటకం పంపండి. చదివి, తయారై వుంటాను.' హాలుదాటి,గుమ్మంలో కొచ్చేశాము. నాకేసి మెత్తగా చూసి, పెదవులు మందహాసంతో తొందరగా కదిల్చింది. కార్లో దిగబెట్టి రమ్మని డ్రైవర్‌తో చెప్పింది. కారు కదిలింది.

ఇక్కడినుండి సంగతులు వేగంగా జరిగాయి. నాకన్నీ పూర్తిగా జ్ఞాపకంలేవు. ఏది ముందో, ఏది వెనకో కూడా

తెలీదు! కార్లో కంపెనీవారి పార్కుకు వెళ్ళాం. కాంతా రావుగారక్కడ లేరన్నారు. జనం గుంపులు గుంపులుగా గుమిగూడుతున్నారు. పగటి వేషాలతో యీ గోళంపై జరుగు తున్న జీవితనాటకంపై పడిన తెరలా చీకటి జారుతోంది. మేఘాల అంచుల్లో కాంతికిరణాలు రగిల్చిన ఎరుపు, బంగారు రంగులు రంగస్థలంపై ఆర్పేసిన దీపాలుగా విడిపోతున్నాయి. పిచ్చోళ్ళ లుగీతంలా పక్షులు చెట్లల్లో అలిసిన కంఠాలతో లయ, క్రమం లేకుండా గానంచేస్తున్నాయి. కాంతారావ్‌గా రెక్కడుంటారో, ఎవ్వరూ చెప్పేవారు లేరు. కార్లో వారింటికి వెళ్ళాం. అంతక్రితమే అక్కడనుంచి వెళ్ళాడన్నారు. నా క్కావల్సింది నాటకం వ్రాతప్రతి. దీనదయాళ్ దగ్గర దొర కొచ్చు. అతనికోసం బయలుదేరాము. వాళ్ళందరూ ఆ సాయంత్రం కార్యక్రమానికి ఆహ్వానింపబడిన పై వూళ్ళ పెద్దలకు స్వాగతం యివ్వడానికి స్టేషన్ కెళ్ళారట. నేనూ వెళ్ళాను. దీనదయాళ్ దొరికాడు. పక్కగా పిల్చి 'నాటకం కాపీ, వొకటివ్వవలసిందని కోరాను. అందులో పాత్రధారుల నందరినీ కలుసుకోవాలి, వాళ్ళదగ్గరికి తీసుకెళ్ళమని అడిగాను. అతనికి ఆ వివరాలు తెలీవట. నూపరెంటు శ్రీనివాసుల్ని కనుక్కోమన్నాడు. నాకు వొళ్ళు మండింది.

సాంస్కృతిక శాఖకి కార్యదర్శిగా వీణ్ణి నియోగించిం దెవరు? వాడికి అర్హతలేదు. వెంటనే మరొకణ్ణి నియమించ వల్సిందని కాంతారావ్‌కి రికమెండ్ చెయ్యాలి. తప్ప దను కున్నాను.

'కాంతారా వేడీ?'

'తెలీదు' అన్నాడు – దీనదయాళ్. – దెయ్యంగాడు! అసలు వీడు ఏ వుద్యోగానికీ తగడని వ్రాతపూర్వకంగా కాంతారావుకి విన్నవించుకోవా లనుకున్నాను.

శ్రీనివాసుల్ని వెదుక్కుంటూ బైలుదేరాను.

'అమ్మగారు ఎదురు చూస్తుంటా రండి, కారుకోసం' అన్నాడు డ్రైవర్.

'ఫరవాలేదు–పోనీ–నే చెప్తాలే' అన్నాను ధీమాగా.

శ్రీనివాసులింటికి చేరుకున్నాం.

ఇప్పుడే పార్కుకి వెళ్ళారన్నారు. మళ్ళా పార్కుకి పట్టమన్నా కారుని.

మైలుంటుంది అక్కడనుంచి. రెండు మూడు ఫర్లాంగులొచ్చాక, కారు రోడ్డు పక్కగా లాగి నిలబెట్టేశాడు.

'ఏం?'

'గాలి పోతోందండి.' దానికి కొత్తగా ట్యూబ్ రహితమైన టైరు వేశారట. అందులో గుబ్బపునాడా దిగిందట. నేలకి దిగిపోతుండట టైరు. ఏడు కావొస్తోంది. వీడు యీ రిపేర్లు పూర్తి చేసేటప్పటికి నా నాటకం ప్రారంభం కావడము, ముగియడం జరుగుతుంది కావున, నడవడం వుత్తమమని నడక సాగించాను. ఓ ఫర్లాంగు నడిచాక జట్కాబండి కనబడింది. అందులో ఎక్కి పార్కుదగ్గరికి చేరుకున్నాను. వెతగ్గా వెతగ్గా అరగంటకి శ్రీనివాసులు దొరికాడు. అతనిదగ్గర, నాటకం పోర్షన్ కాగితాలు తీసుకుని, వెంటనే వాటిని డాక్టర్ హరికృష్ణగారింట్లో అందచెయ్యాలన్నాను. వాటిని జీపులో మనిషినిచ్చి పంపించాడు. వేషాలు సిద్ధం. అమ్మయ్య అనుకుని

నిట్టూర్చాను. వేషధారులంతా ఎక్కడని అడిగాను. దూరంగా వో చావడిలోకి తీసుకెళ్ళాడు. అక్కడ ఇద్దరు వ్యక్తు లున్నారు. మిగతావాళ్ళు కాఫీలకి వెళ్ళారట. మరి వేషాలు వేసుకోడం ఎప్పుడన్నాను. పద్మ–ప్రధాన స్త్రీపాత–ఇంటిదగ్గరే తయారవుతోందిట.

'మరి మీరో?'

'అసలు మా వేషాలేమిటో తేలడంలేదండి.'

ఆ యిద్దరూ ఒక వేషంకోసం తగువులాడుకుని, యిద్దరూ ఆ వేషంపోర్షనే చూసుకుంటున్నారట. ఏ అవయవమూ సరిగ్గా లేని ఒక హార్మోనియం తాలూకు కళేబరాన్ని యిష్టమొచ్చినట్లు వాయించేస్తున్నాడు మరోవ్యక్తి. అతన్ని ఆపమన్నాను.

'ఇందులో పాటలు–అవీ వుండవు. హార్మోనియమ్ దేనికి –మధ్య మధ్య విరామం అంటూ కూడా లేదే' అన్నాను.

దానికి సమాధానం లేదు. ప్రేక్షకులనినాదాలు పాత్రధారులకు వినబడకుండానా?

'లేదండి–పాత్రలు వొకరి పోర్షన్ మరొకళ్ళు చెబుతుంటే, ప్రేక్షకులు గ్రహించడానికి వీల్లేకుండా' అన్నాడు శ్రీనివాసులు నవ్వుతూ. ఆ యిద్దరికీ పాత్రలు నిర్ణయించి చదవడన్నా–మధ్యలో వొచ్చే యితరవేషాల పోర్షన్ నేను చదువుతూ అరగంట సాగింతర్వాత, మిగతా పాత్రధారులు కూడా వొచ్చారు–పద్మ తప్ప. ఉన్నవాళ్ళతోనే వొకసారి చదివిద్దామనుకుంటూండగా, కాంతారావ్ గారు రమ్మనమన్నారంటూ వో నౌకరొచ్చాడు. అన్నీ కాంతారావ్ సరి

చేస్తాడన్న ధైర్యంకూడా యిప్పుడు సన్నగిల్లింది. అయినా, నాకు తెలీని శక్తులు అతనిలో వుండొచ్చు; తల్చుకుంటే ఏది చెయ్యలేడు? అతను గట్టిగా అడిగితే, కంపెనీలో యీవత్తు జనం వేషాలేసుగుని రంగస్థలం పైకి వురకరూ?

అతనిదగ్గరకు వెళ్ళాం. వరండాలో పది పదిహేనుగురు పెద్దలమధ్య ఆసీనుడై వున్నాడు. అల్పాహారవిందు సాగుతోంది— కేకులు, బ్రెడ్, వొక 'హాట్', మాపిల్స్, టీ, 'బీడా', 'సిగరెట్'. కాంతారావుని బైటికి ఎడంగా రమ్మని మాట్లాడాలనివుంది. కాని పిలవొచ్చా? బాగుంటుందా? ఇంతలో వొకాయన సినిమాపాటలు పాడటం లంకించుకున్నాడు.

ఎనిమిది దాటింది. ఇంక నాటకం ఎప్పుడు—? జనం చాపలమీదా, బెంచీలమీదా, కుర్చీలమీదా నిండు కున్నారు. చెట్లమీదా, గోడలమీదా, వరండాలమీదా పని వాండ్ర కుటుంబాలు నిలబడ్డాయి. నాటకం రక్తికట్టాలంటే ప్రేక్షకులు బాగా వుండాలి. దానికి లోటు లేదు. కాని వీరిలో సగంపైగా పామరజనం. వీళ్ళకీ నాటకం రుచించదు. గోల చేస్తారు. తప్పదు. ఏ గోలైనా భరిస్తాడు నాటకకర్త—నాటకంఆడు తుంటే చూడాలని సంకల్పించినప్పుడు. పురప్రముఖులు, పై వూళ్ళ పెద్దలు పార్కులోకి చేరుకున్నారు. 'హార్మోనిష్టు' ఆ కళే బరాన్ని విరగగొట్టేస్తున్నాడు. దానికి జన్మరాహిత్యం – మహా పురుషులకు కూడా సాధ్యం కానిది. తొమ్మిదైంది. కాంతా రావు వేదికపైకొచ్చి— వో కాగితం చూస్తూ ఆంగ్లంలో వుప న్యాసం సాగించాడు.

తమకంపెనీ యథోచితంగా జాతినిర్మాణకార్యక్రమానికి పూనుకుంది. ఈనాటికి తాము సాధించిన ఫలితాలు తెలిస్తే కంపెనీ స్థాపించిన దొరగారు ఎంత సంతోషిద్దురో - ఆయన చనిపోయి నలభై సంవత్సరాలైనా, ఆయన ఆదర్శాలు, పట్టుదల, దయ వారికి అంగరక్ష. ఐహికరంగంలోనే గాక, సాంస్కృతికరంగంలో కూడా తాము వుడుతాభక్తి అన్నట్లు కొద్దో గొప్పో సేవచేస్తూనే వున్నారు. వారీ విధంగా పనిచేస్తే పంచవర్ష ప్రణాళిక జయంగా కొనసాగి, దేశాభ్యుదయానికి తోడ్పడి, జాతి పురోగమనానికి, అంతర్జాతీయ శాంతి స్థాపనకి పునాదులు వేస్తున్నామంటే అతిశయోక్తి లేదు.

జనం చప్పట్లు కొడుతున్నారు.

తాము చేస్తున్న సత్కార్యానికి నిదర్శనం నేడు సమావేశమైన ప్రేక్షకజనం.

సమయానికి ఆహ్వానపత్రాలు అందకపోయినా, వొందలాదిగా వొచ్చి, తమకు సలహాలనిచ్చిన యీ అతిథులకు కృతజ్ఞత ఎల్లా ప్రకటించాలో తెలీడంలేదు. (చప్పట్లు)

ఈనాటి కార్యక్రమంలో కొద్ది మార్పు జరిగింది. అందుకు సభికులు మన్నించాలి. అనుకున్న నాటకానికి బదులు పంచవర్షప్రణాళికని గూర్చి బుర్రకథ ఏర్పాటైంది. (చప్పట్లు)

తనకి అవతల చాలా తొందరపని వుండడంవల్ల తాను చివరిదాకా వుండలేకపోయినందుకు చింతిస్తున్నాననీ, తన స్థానంలో కార్యక్రమం నడిపే లాజరస్‌గారికే ఎక్కువ అర్హత వున్నదనీ - వుపన్యాసం ముగించాడు కాంతారావ్. చప్పట్లుకొడుతూనే వున్నారు. అతను బైటకొచ్చాడు.

ఆ రాత్రి భోజనాలుచేసి, మా గదులకు చేరేటప్పటికి పదకొండైంది.

'మరోసారి మంచివాళ్ళచేత యీ నాటకం ఆడిద్దాం. మంత్రులను కూడా ఆహ్వానిద్దాం' అన్నాడు కాంతారావు, సీసాకార్కు తీసి గ్లాసులో ద్రావకం పోస్తూ.

'ఇప్పుడు వెయ్యకపోవడమే మంచిది.'

'బాగా చెప్పావ్ - ఈ గ్లాస్ తీసుకో - ఇది 'వెయిన్ మూత్.' చాలా మంచిది. హాయిగా నిద్ర పడుతుంది.'

'నా కొద్దు.'

'పోనీ, నిమ్మరసం ఐస్‌లో కలిపిస్తాను. తలనొప్పా?'

'ఏం లేదు?'

'కోడోప్పైరీన్ - టాబ్లెట్ వేసుకో - తలనెప్పి తగ్గి, నిద్రపడుతుంది' అతను గదిలో కెళ్ళిపొయ్యాడు. నేనూ నా గదిలో కెళ్ళి పరున్నాను. తల పగిలిపోతూంది - కణతలమీద సుత్తితో కొడుతున్నట్లు ఆ హార్మోనియమ్ చప్పుడు చెవులో పీడగానంచేస్తూంది.

ఆధునిక నాటకరంగం గురించి ఘనమైన వ్యాసాలు వ్రాయాలి. వెనకటి నాటకాలు పోయినై. ఆధునిక నాటకం పుట్టలేదు. నటీ నటులు లేరు. ఆడుకునేందుకు భవనాలు లేవు. వాద్యాలులేవు. నడిపే నాథుడు లేడు. స్త్రీపాత్రలు దొరకవు. ఏ కవేళ దొరికినా, నాటకంనాడు లేచిపోతారు. ఈ పరిస్థితులు తెలుసుండే వ్రాస్తున్నారా నాటక రచయితలు? పరిస్థితులు తెలుసుకోకుండా వీరు వ్రాయడం దేనికి? తీరా అన్నీ సక్రమంగా నిర్వహించి నాటకం ఆడితే, ఆనందించే ప్రేక్షకజనం

వున్నారా? ప్రతివాడూ వో నాటకం వ్రాయడం, తన సమ్మతి లేందే దాన్ని ఎవ్వరూ ఆడకూడదంటూ, మొదటి పేజీమీద లాయర్ నోటీసివ్వడం – మహా యీ నాటకం ఆడాలని, ఆంధ్రావని పరితపిస్తూన్నట్లు – ఇవన్నీ బైటపెట్టి, వ్రాసేవాళ్ళని విమర్శిస్తూ సుదీర్ఘమైన వ్యాసం వ్రాయాలి. వాక్యాలు నిర్మాణం చేస్తూ నిద్రపోయేటప్పటికి మూడైందో నాలుగైందో తెలీదు. లేచేటప్పటికి ఏడు దాటింది. అయ్యగారు రమ్మంటున్నారని నౌకరు పిలిచాడు. కాంతారావు స్నానంచేసుకుని ముస్తాబై, టిఫిన్‌కి కూర్చున్నాడు. నన్ను చప్పున స్నానం చేసి రమ్మన్నాడు. క్షురకర్మ చేసుకోవాలన్నాను.

'సరే, నేను మళ్ళా ఓ గంటలో వొస్తాను. సిద్ధంగా వుండు. నీ రైలు తొమ్మిదింటికి' అన్నాడు.

స్నానంచేసి సిద్ధం అయ్యేప్పటికి ఎనిమిది దాటింది. టిఫిన్ పుచ్చుకున్నాను. శ్రీనివాసులు వో నల్లపెట్టె తీసుకుని చక్కా వొచ్చాడు. మొదట్లో అది హార్మోనియమ్ అనుకుని భయపడ్డాను. అందులోవన్నీ త్రాగుడు సీసాలు. వాటిని తీసి రిఫ్రిజిరేటర్‌లో పెడుతున్నాడు.

'రాత్రి బాగా జరిగిందా?'

'ఓ పదకొండైందండీ. కిక్కురుమనకుండా కూర్చున్నారు జనం.'

'నాటకం వాళ్ళు?'

'సీతావనవాసం పీఠినాటకంబృందంలో కలిసి దంచేశారు.'

'బృంద రాలేదా?'

'లేదు'

'సుధామయిగారు?'

'నే అన్నానని చెప్పకండి. ఆవిడ లేచిపోయిందనుకుంటున్నారు.'

'ఎవరితో?'

'నాకు తెలీదు.'

శ్రీనివాసులు వెళ్ళిపోయ్యాడు. ఆ ముక్క నా చెవిని పడెయ్యడంలో అతనికి మనశ్శాంతి చేకూరింది. నే సరి నమ్మలేను. కాంతారావ్ కార్లో వొచ్చాడు. స్టేషన్‌కి బైలుదేరాం.

'నేను వొస్తా' అన్నాడు కాంతారావు.

ఇది వోదార్పు వీడ్కోలనుకున్నాను. పెట్రోల్‌కోసం కారు నిలిచింది. ఎదురుగా డాక్టరు హరికృష్ణ బంగళా. గేటు వెనక గుబురుగా ఎదిగిన గడ్డిని కత్తిరిస్తున్నాడు తోటమాలి. చామనచాయ ఎత్తుగావున్నాడు. పెద్దచింపిరిజుత్తు. కండలుఎండకి చెమటలో నిగనిగలాడుతున్నాయి. చేతి కదలికకి లయ కలుపుతూ భుజాన, వెన్నుమీద, మెడ, తొడ, నడుంపైన కండరాలు, నరాలు వొంపులు తిరిగి, కదులుతున్నాయి. పురుషత్వం అంటే అది – సృష్టికి మూలమైన యంత్రం అది. ఆశక్తి రాతిశిల్పం పైనగాని వ్యక్తంగాదు. తోటమాలి శరీరాన్ని చూస్తే, ఏ శిల్పి సంతోషించడు? ఆ కదలికలోని సౌందర్యం, ఏ రాతివిగ్రహం చూపగలదు? చేతగాక, శిల్పులు తమతలలు ఆ రాతికేసి పగలగొట్టుకోవాలి! కార్యదర్శి సుధామయి వొక్క తోటమాలినే నిజంగా ప్రేమించిందన్నమాట జ్ఞాపకంవొచ్చింది. అది నమ్ముతాను. వాడిలో

సంస్కృతి, నాగరికత లేవు. వాటివల్ల వొచ్చే బిడియము, దాప రికము, అసహజమైన సభ్యత లేవు. స్వచ్ఛమైన స్థూలమైన ఇంద్రి యానుభూతి - అందలి తీక్షణాన్ని, ప్రతిభను అనుభవించ గల సంస్కారం ఆమెలో వుంది.

ఆ తోటమాలి తారకం కాబోలు ఎంతధన్యుడు! వాడు నాటకాలు వ్రాయడు. వ్రాసేవాళ్ళని ఎరగడు. ఆ మట్టిలో, ఆ గడ్డిలో మేఘాలక్రింద గాలిలో చెమటకి తడిసి, ఎండకి ఎండి, ప్రకృతిపెరుగుదలలో తనశక్తులు పెంచుకుంటూ, సృష్టిని తనశరీ రంలో బంధించివేసి, ప్రేరణకి శిఖరాన్నందుకొన్న పరిపూర్ణ తని నింపుకొని, ఎక్కడో, ఎప్పుడో ప్రజ్వరిల్లుతాడు. మనస్సు వుండదు. శూన్యత్వాన్ని శోధించి విశ్వంలోని శూన్యత్వంలో ఐక్యతపొందిన ధన్యజీవి ఆ తోటమాలి! పై కనేశాను:

'తోటమాలిని ప్రేమించిందిట సుధామయి.!'

నీ కప్పుడే తెలిసిందీ! అవును అదొక చిత్రమైన గాధ. చివరిదాకా మా కెవ్వరికీ తెలియదు. రోజూ వాణ్ణి చూస్తూనే వున్నాం - కాని వా డింత కథానాయకుడవుతాడనుకోలేదు'

'అదుగో అటు చూడు - వాడేగా?' అన్నాను గేటు కేసి చూపుతూ.

'ఇంకా నయం...వీడు కాడు. వాడు తారకం. చనిపోయి ఏడాది దాటింది. వీ డెవడో - మరోడు.'

'చనిపోయ్యాడా?'

'ఆత్మహత్య చేసుకున్నాడు.'

'ఎందుకో?'

'వాడు చిన్నప్పటినుండీ హరికృష్ణగారింట్లో వుండే నౌకరు. అతన్ని తండ్రితో సమంగా చూసేవాడు. అతనిభార్య తనని కోరిందని తెలుసుకోగానే వాడిహృదయం చెడిపోయింది. తృణీకరిస్తే ఆమెకి బాధ; అంగీకరిస్తే యజమానిపట్ల అపచారం.'

'ఇదంతా ఎల్లా తెలిసింది?'

'వాడో ఉత్తరం వ్రాశాడు – సుధామయికి – అది నా చేతులో పడింది. ఆమె తనను కోరింది అన్న విషయం వాడికి చెప్పరాని ఆనందం కలుగజేసిందట. ఆ ఆనందం భరించలేక ఆత్మహత్య చేసుకుంటున్నాడట.'

నే నాలోచనలోపడ్డాను. వొకజీవికి అంతటి ఆనందం నైతికచింతన కలగచేసిందంటే ఆమె వొక గొప్పకార్యం సాధించిందనుకున్నాను. ఆ కథ విని, ఆమెపరిచయం పొందడంతో నేనూ నైతికంగా వో అంతస్తు పైకి నడిచినట్టనిపించింది. నైతిక జీవితంలోని సూక్ష్మమైన కొత్త ప్రాంతాన్ని శోధించాను.

'రాత్రి లేచిపోవడం ఏమిటి?'

'లేచిపోయిందా? నే వినలేదే! రాత్రి ఎనిమిదింటికి తన అక్కగారికి జబ్బుగావున్నట్టు టెలిగ్రాం వొస్తే వెంటనే రైలు చేరి వెళ్ళింది – వినోదాలకోసం వేరేవుంచిన డబ్బు కాస్తా తీసుకువెళ్ళింది. నాతో చెప్పే వెళ్ళింది. కంపెనీసొమ్ము. ఆమెకు డబ్బుపట్ల ఏమాత్రం నిజాయితీ లేదు' అన్నాడు కాంతారావ్. నన్ను స్టేషన్లో దింపి, టికెట్ కొనిచ్చి, రైలు

కోసం చూస్తూండగా రైలొచ్చింది. రాత్రంతా ఐస్‌తిని, పళ్ళు పీకుతున్నట్లనిపించి శేళ్ళతో కదుపుతున్నాను.

'మనందరికీ పళ్ళబాధ – సుధామయికి మాత్రం లేదు' అన్నాడు.

'ఏం?'

'ఆమెవి పెట్టుకున్న పళ్ళు. చిన్నప్పుడు అల్లరిచేస్తే వాళ్ళ నాన్న మూతిమీద కొట్టాడట. వొక్క వంకరపన్ను వికృతంగా వుందని అన్నీ వూడపీకించి కొత్తవి పెట్టించుకుంది'

రైలు కదిలింది. సెలవుతీసుకొని వెళ్ళిపొయ్యాడు కాంతారావు. నా బాధ తగ్గింది. నాటకం ఆడలేదన్న చింత పటాపంచలైంది. నాలో ఏదో మాలిన్యం దిగజారింది.